ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 7 నవంబరు 2024 | 5

వాన్స్.. ఆంధ్రా అల్లుడే!
అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి తూర్పుగోదావరి అమ్మాయే

బరితెగించినా.. వదిలేశారు..

- సోషల్ మీడియాలో చెలరేగాడు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై నీచమైన పోస్టులు
- పలు పేర్లతో ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలు
- వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్త బరితెగింపు
- టీడీపీపై బురద చల్లడమే పని
- ఉదాశీనంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- నోటీసు ఇచ్చి వదిలేశారు..
- తూర్పు పోలీసుల తీరుపైనా విమర్శలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారంటూ ఆ పార్టీ పెద్దలు గగ్గోలు పెడుతున్నారు. కానీ తమ కార్యకర్తలు చేస్తున్న నీచమైన పనులు వాళ్లకు కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సోషల్ మీడియాలో నీలం ముఠా రెచ్చిపోవడం తెలిసిందే. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా బరితెగించారు. అయినా జగన్ ఎప్పుడూ వాళ్లను వారించకుండా ఓ విషపు నవ్వుతో ఎగదోయడం జనాలకు బాగా తెలుసు. ఆ దారుణాలపై ఫిర్యాదు చేయలేనంతగా భయభ్రాంతులకు గురిచేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆ జాడ్యం వదలడం లేదు. టీడీపీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై సోషల్ మీడియా వేదికగా దారుణంగా పోస్టులు పెడుతున్నారు. నాలుగు నెలలు హెచ్చరించిన కూటమి ప్రభుత్వం చేతల్లోకి దిగేసరికి వైసీపీ మూకల్లో ఇప్పుడు గుబులు పుడుతోంది.

● ఇంత నీచమైన దిగజారుడా..

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరాబత్తుల చంద్రశేఖర్‌కి ఫేస్‌బుక్‌లో చందు వైఎస్ఆర్‌సీపీ (చందు), చందు వైఎస్ఆర్‌సీపీ, చందు వైఎస్ఆర్‌సీపీ చందు అనే పేర్లతో ఎక్కౌంట్లు ఉన్నాయి. వీటిలో గత వైసీపీ పాలన కాలంలో టీడీపీపై వ్యతిరేకంగా వైసీపీని వెనకేసుకొస్తూ పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నాడు. మరో ఎక్కౌంటు కూడా ఉంది. దాని పేరు మరీ బూతుపదాలతో పెట్టాడు. ఇన్‌స్టాగ్రాంలో చంద్రశేఖర్ 7799 అనే పేరుతో ఎక్కౌంట్ క్రియేట్ చేశాడు. వీటి ముఖ్య ఉద్దేశం టీడీపీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తదితర నేతలపై నీచమైన పోస్టులు పెట్టడమే. మహిళా నేతలపై పెడుతున్న పోస్టులు చదవడానికి కూడా సిగ్గుపడాల్సిన విధంగా ఉంటున్నాయి. చంద్రబాబు ఖైదీ దుస్తులతో జైలులో భోజనం తింటున్నట్టు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ టీ అమ్ముతున్నట్టు గతంలో పోస్టులుపెట్టాడు. వీటిపై ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేశారు. అప్పట్లో పోలీసుల పరిస్థితి అందరికీ సుపరిచితమే. ఎంపీ పురందేశ్వరిపై ఎన్నికల సమయంలో పోస్ట్ చేసిన ఓ పోస్టు మరీ దారుణంగా ఉంది. ఎన్నికలకు ముందు రంగంపేట పోలీస్‌స్టేషను పరిధిలోని ఇల్లపల్లి అనే గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవ జరిగింది. టీడీపీ వాళ్లపై విరుచుకుపడాలని జనాలను రెచ్చగొడుతూ, వైషమ్యాలు చెలరేగే విధంగా అప్పట్లో పోస్టు పెట్టాడు. మళ్లీ దానిని ఈ ఆగస్టు 8న పోస్ట్ చేశాడు. అతడి దురాగతాలకు అంతులేకుండా పోవడంతో నూతిక బాబూరావు అనే వ్యక్తి డీజీకి ఫిర్యాదుచేశారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలతో ఈనెల 3న చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలపై దారుణంగా, ఎంపీ పురందేశ్వరిపై చదవలేని విధంగా, గ్రామాల్లో విద్వేషాలు పురిగొలిపే విధంగా పోస్టులు పెడుతూ రెచ్చిపోతున్న చంద్రశేఖర్‌పై డీజీపీ ఆదేశాలతో ఎట్టకేలకు అనపర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ మరుసటి రోజున మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి స్టేషనుకు వెళ్లి సీఐ సంపత్‌పై చిందులేశారు. దీంతో చంద్రశేఖర్‌ని సాదరంగా ఇంటికి పంపేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంత ఉదాశీనంగా ఎందుకు వ్యవహరించలేదని జనం ప్రశ్నిస్తున్నారు. వైసీపీ దాష్టీకాలను ప్రశ్నించే వారిపై దాడిచేసినా పోలీసులు పట్టించుకోని సంఘటనలు ఉన్నాయని, బాధితులైన టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెట్టి వేధించేవారని గుర్తుచేస్తున్నారు. జిల్లాలోని కొందరు పోలీసులు వైసీపీ ముసుగులో పనిచేస్తున్నారని, అందువల్ల ఆయా కేసులు నీరుగారిపోయే ప్రమాదం ఉందని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే హెచ్చరించింది. ఇప్పుడైనా చర్యలుంటాయో లేదో చూడాలి.

జిల్లా కేంద్రాల్లోనే ఉపాధ్యాయులకు

శిక్షణ తరగతులు నిర్వహించాలి

స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఉపాధ్యాయుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రాలను వదిలి పెట్టి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో స్కూల్ లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం తగదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని మల్లంపూడిలో సాయి మాధవి కళాశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు బుధవారం కొద్దిసేపు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నాన్ రెసిడెన్షియల్‌తో పాటుగా శిక్షణా తరగతులకు పాఠశాల సమయాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏ జిల్లాకు ఆ జిల్లాల వారీ లీడర్‌షిప్ శిక్షణా తరగతులు నిర్వహించాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. 50 సంవత్సరాలు పైబడినవారిని, అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని శిక్షణ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా అగిరిపల్లిలో హీల్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న లీడర్‌షిప్ శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందుతూ ఆకస్మికంగా ఉండూరు హైస్కూల్ హెచ్‌ఎం టీవీ రత్న కుమార్ మృతిచెందడంతో ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. వివిధ పాఠశాలల టీచర్స్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఆర్‌జేడీ జి.నాగమణి



ప్రసంగిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్‌జేడీ జి.నాగమణి పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం మల్లంపూడిలోని సాయి మాధవి కళాశాలలో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు. సిలబస్‌ను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని, దివ్యాంగ బాలలు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, ఏఎంవో గౌరీశంకర్, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎంఈవోలు, హైస్కూల్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను

తక్షణం నిలిపివేయాలి

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పనిదినాల్లో ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగిరిపల్లిలో జరిగిన ప్రధానోపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో ఉండి మండలం గరగదుర్రు హెచ్‌ఎం రత్నకుమార్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. ప్రధానోపాధ్యాయులకు పనిదినాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను నిలిపివేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి విషాద సంఘటన జరిగిందని ఆయన అన్నారు. ఏకకాలంలో అనేక పనులు అప్పగిస్తూ ప్రధానోపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.3438 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని, యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా తదితరులు వివిధ అంశాలపై మాట్లాడారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రాజమహేంద్రవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఏ చట్టం ప్రకారం లైసెన్సు తీసుకున్నా.. జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం-2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణాధికారి కె.భాస్కరరావు చెప్పారు. సవరించిన చట్టాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. దీనిపై ఇప్పటికే గత నెల 22న ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసినట్లు గుర్తుచేశారు. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుకు అవసరమైన పత్రాలను జత చేసి ఈనెల 11 లోపు విజయవాడలోని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకునికి పంపించాలని ఆయన సూచించారు. అలాగే పూర్తి వివరాలను http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వివరాలకు 9100045409, 9640571098 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



మందులో చిటపటలు!

- మద్యం వ్యాపారంలో గతుకులు..
- ఇదే అదనుగా సిండికేట్లలో వైసీపీ పాగా
- కోవర్టులతో పార్టీకి పొంచివున్న ప్రమాదం
- ముందే వెల్లడించిన 'ఆంధ్రజ్యోతి'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారం విషయంలో కూటమి నాయకుల నడుమ చిటపటలు చల్లారడం లేదు. రోజురోజుకూ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల మధ్య గతుకులు ఎక్కువవుతున్నాయి. దీనికి ప్రజాప్రతినిధుల తీరు ఆజ్యం పోస్తోంది. ఐక్య ధర్మం పాటించాల్సిన నియోజకవర్గ పెద్దలు లోపాయికారిగా ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో కింది స్థాయి నాయకుల్లో మద్యం రగడ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఇసుక వంటి విషయాల్లో జోక్యంతో రచ్చచేసిన కూటమిలోని కొందరి తీరు వల్ల పార్టీలు ఇరుకున పడుతున్నాయి. సాక్షాత్తూ చంద్రబాబు హెచ్చరించినా.. అక్కడ తలవూపి ఇక్కడకు వచ్చిన తర్వాత మామూలుగానే వ్యవహరిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. మద్యం వ్యాపారం టీడీపీ, జనసేన నాయకుల నడుమ రగడకు ఆజ్యం పోస్తోంది. ఇదే అదనుగా వైసీపీ చాప కింద నీరులా బినామీల పేరుతో పాగా వేయడానికి పావులు కదుపుతోంది. కూటమిలోని కోవర్టుల తతంగం పార్టీకి ముప్పు తెచ్చే విధంగా ఉందంటూ గతంలోనే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది. ఈనేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల్లోని కొందరు ఐక్య ధర్మాన్ని మరిచి రాబడికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వైసీపీ నాయకులు పెట్టుబడి పెడుతుంటే తెరపైన కొందరు కూటమి నాయకులు వ్యవహారం నడుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఐదేళ్లలో టీడీపీకి వైసీపీ పెద్దలు చేసిన నిర్వాకాలను రాస్తే పెద్ద అరాచక గ్రంథమే అవుతుంది. ఏకంగా తప్పుడు కేసు పెట్టి చంద్రబాబును సైతం 53 రోజులపాటు జైలుకు పంపి.. అక్కడ ఇబ్బందులు పెట్టి పైశాచిక ఆనందం పొందారు. టీడీపీ నాయకుల ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టారు. పెదవి విప్పితే కేసులు పెట్టారు. ఇప్పుడు మాత్రం పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు తెరవెనుక వైసీపీ నాయకులతో కలిసి నడుస్తున్నారు. అమరావతిలోని పార్టీల పెద్దలు రాష్ట్రాభివృద్ధి విషయంలో తలమునకలై ఉంటే.. స్థానికంగా మాత్రం స్వీయ సంపాదనకే ప్రాధాన్యం ఇస్తున్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది. ఈ విధానం వైసీపీకి బాగా కలిసి వస్తోంది. మద్యం దుకాణాల్లో వైసీపీ బినామీలపై 'మద్యమే మార్గంగా' అనే శీర్షికతో రహస్యంగా జరుగుతున్న తంతును గత నెల 25న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనం అటు వైసీపీ, ఇటు టీడీపీ, జనసేన వర్గాలో సంచలనమైంది. సిండికేట్లు అనేవి నమ్మకం మీద నడుస్తుంటాయి. వీటిలో కూడా నమ్మక ద్రోహం చేస్తూ వైసీపీ పెట్టుబడులతో కూటమి ముసుగులో సిండికేట్లలో ఉన్న వాళ్లేవరా అని అన్ని నియోజకవర్గాల్లో చర్చ నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులను టార్గెట్ చేసి మరీ వ్యాపారాలపై వేటు వేసి ఆర్థికంగా దెబ్బతీసిందని, ఇప్పుడు వైసీపీ నాయకులకు లోపాయికారిగా కొమ్ముకాస్తున్న వారిని సహించేది లేదని పార్టీకి విధేయులైన కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగానే అంటున్నారు. జనసేన నాయకులను మచ్చిక చేసుకొని వైసీపీ నాయకులు పెట్టుబడులు ఎక్కువగా పెట్టడంతో ఆ పార్టీని నమ్ముకొని ఉన్న జనసైనికులు ద్రోహుల గురించి ఆరా తీస్తున్నారని తెలుస్తోంది.

ఇదీ జరిగింది..

మద్యం దుకాణాల కేటాయింపును కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించింది. ఎక్కడా విమర్శలకు తావు లేకుండా లాటరీ ప్రక్రియను సైతం వీడియోలు తీయించారు. ఈ క్రమంలో జిల్లాలోని 125 షాపుల కోసం 4,384 మంది దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలు కావడంతో కొందరు బృందంగా ఏర్పడి పెట్టుబడి పెట్టారు. వీరిలో కొందరి వెనుక వైసీపీ నాయకులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. లాటరీ విధానం వల్ల వైసీపీ నాయకులు పెట్టుబడి పెట్టిన వారికి, కొన్నిచోట్ల సిండికేట్లతో సంబంధం లేని వాళ్లకూ దుకాణాలు దక్కాయి. అయితే, అప్పటికే ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు తమ వెంట తిరిగే అనుచరులకు మద్యం దుకాణాల ఆశ చూపడంతో కొన్ని చోట్ల సమస్యలు తెరపైకి వచ్చాయి. దీంతో కూటమి, వైసీపీ నాయకుల మధ్య ఆయా ప్రజాప్రతినిధులు సయోధ్య కుదర్చే పనిలో పడ్డారు.

ఇలాంటి పనులే..

కూటమిలోని కొందరు ప్రజాప్రతినిధుల తీరు వైసీపీకి మార్గం సుగమం చేసే విధంగా ఉంది. సొంత వాళ్లను కలుపుకొని వెళ్లకపోవడం, ఒకరిద్దని అందలం ఎక్కించడం, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఇబ్బందులు పడిన వాళ్లను పక్కన పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత గూట్లోంచి బయటకు వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం, వారితో సంబంధం లేదని వీరు, వీరితో సంబంధం లేదని వారు ప్రచారం చేసుకోవడం వంటివి పార్టీల్లో ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీ జెండా నిలబడడం కోసం అహర్నిసలు శ్రమించిన వారిని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ఆవేదనను వైసీపీ తనకు అనుకూలంగా మలుచుకొని మద్యం బిజినెస్‌ని చక్కబెట్టుకుంటోంది.

ఇదేం తీరు..

నిడదవోలు నియోజకవర్గంలో మెజారిటీ షాపులు లాటరీలో వైసీపీ వర్గం వారికి దక్కాయి. నిడదవోలు టౌన్ 4, రూరల్‌లో 5 షాపులు.. మొత్తం 9లో ఐదు షాపులు ఒక వైసీపీ గ్రామస్థాయి నాయకుడి ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. యథావిధిగా నిబంధనలు పాటించడం లేదు. అతడి జోలికి అధికారులు రాకుండా చూసుకోడానికి కొందరు కూటమి నాయకులకు భాగస్వామ్యం ఇచ్చినట్టు సమాచారం. దీంతో మిగతా కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని ప్రజాప్రతినిధి నగరంలోని ఒక ప్రముఖ హోటల్లో పట్టభద్రుల ఓట్ల నమోదు, టీడీపీ సభ్యత్వంపై అవగాహన సదస్సు పేరుతో రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇందులో ఇద్దరు నాయకులను ఆకాశానికి ఎత్తేశారు. దీంతో తెలుగు తమ్ముళ్లు లోలోపల మదన పడుతున్నారు. ఆ ఇద్దరి నాయకులే ఎన్నికల్లో బాగా కష్టబడి పని చేశారని చెప్పుకురావడంతో సీనియర్ నాయకులు సైతం బాధపడుతున్న పరిస్థితి ఉంది. వాస్తవానికి గతంలో ఇసుక వ్యవహారంలో ఆ ఇద్దరి నాయకుల తీరుతోనే చెడ్డపేరు వచ్చిందని, మళ్లీ వారికే ప్రాధాన్యం ఇవ్వడమేమిటని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్లు ఏమయ్యారని ప్రశ్నిస్తున్నారు. మద్యం వ్యాపారంలో చక్కపెట్టే పని కూడా ఆ ఇద్దరే చూస్తున్నారనే విషయం బహిరంగ రహస్యమని అంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆ ప్రజాప్రతినిధి ఇదే విధానం పాటించడంతో కార్యకర్తలకు అన్యాయం జరిగిన సందర్భాలను గుర్తుచేస్తున్నారు. రాజానగరం 'సెటిల్' చేశారనే ప్రచారం జరుగుతోంది. జనసేనకు వాటా తేల్చకపోవడంతో ఆ ప్రజాప్రతినిధి తెరవెనుక ఉండి ఈ తతంగం నడిపించారనే విమర్శలున్నారు. పైగా ఆయన టీడీపీ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదని, టీడీపీకంటే జనసేన నాయకులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే అధికారులకు హుకుం జారీచేశారని చెబుతున్నారు. ఈ తీరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య అగాథానికి దారితీస్తోంది. సిటీ నియోజకవర్గంలో పాత మద్యం సిండికేట్లలోకే షాపులు వెళ్లిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే సిటీ, రూరల్‌లోని రెండు షాపుల్లో మాజీ ఎంపీ తరఫున వాటా ఉందనే విషయం బయటకు రావడంతో భాగస్వామ్యం ముసుగులో ఉన్న ఆ కోవర్టులను బయటికి పంపించాలనే గొడవలు రాజుకున్నాయి. అనపర్తి, గోపాలపురం నియోజకవర్గాల్లోని షాపుల్లోనూ వైసీపీ వారు స్లీపింగ్ పార్టనర్లుగా ఉండడం చర్చనీయాంశమైంది.

సరుకుల రేట్లు డిస్‌ప్లే చేయాలి

నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరల్లో అందించాలి : కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, తక్షణమే అన్ని రైతుబజార్లు, ఇతర ఔట్‌లెట్ల వద్ద సరుకుల రేట్లు డిస్‌ప్లే చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారుల్ని ఆదేశించారు. హోల్‌సేల్, రీటైల్ రంగంలో ధరలను విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు, ఇతర నిత్యావసరాలు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం ఉల్లిపాయలు, ఆయిల్ సబ్సిడీ ధరల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నా తగిన ప్రచారం కల్పించడంలో నిర్లక్ష్యం వల్ల వినియోగదారులు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో ప్రతిరోజూ ధరల వ్యత్యాసాలు, సరుకు ఎక్కడ లభ్యత తెలుసుకుని ఆమేరకు రైతు బజార్లు, మార్కెటింగ్, పౌరసరఫరాలు, స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో మరిన్ని ఔట్‌లెట్లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఏ రోజుకారోజు బియ్యం, ఆయిల్, ఉల్లిపాయలు, కందిపప్పు రోజువారీ అమ్మకాల వివరాలను అందజేయాలన్నారు. జేసీ చిన్నరాముడు, డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాద్, ఇతర అధికారులు, హోల్‌సేల్ ట్రేడర్లు పాల్గొన్నారు.



నెలటూరులోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న కలెక్టర్

క్షేత్రస్థాయి పర్యటనల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

- ఖరీఫ్ సీజన్ సేకరణపై పి.ప్రశాంతి సమీక్ష
- కనీస మద్దతు ధరకంటే ఎక్కువ రైతుకు దక్కేలా పర్యవేక్షణ
- బ్యాంకు గ్యారెంటీ జమచేయని మిల్లులు బ్లాక్ లిస్టులోకి

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరం వైజంక్షన్‌లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో కోతలు చేపడుతున్న ఆర్ఎస్‌కే వారీగా వివరాలు సేకరించి వాటిని ఎక్కడ విక్రయించేస్తున్నారనే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. నల్లజర్ల, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు మండలల పరిధిలో ఖరీఫ్ సీజన్ కోతలు జరుగుతున్నాయని, పెరవలిలో కూడా కోతలు ఆరంభమైయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సగటున వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో కోతలు 3 వేల మెట్రిక్ టన్నులు ఉండగా మిగిలిన వాటికి చెందిన వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ప్రభుత్వ నిర్దేశించిన కనీస మద్దతు ధరకంటే ఎక్కువగా లభించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ జమచేయని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టవలసిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు అధికారులు మొక్కుబడిగా చేయకూడదని, అలసత్వం ఉండకూడదన్నారు. సమావేశంలో డీఎస్‌వో కేవీఎస్ఎం ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, లీగల్ అండ్ మెట్రాలజీ ఏసీ సామ్యూల్‌రాజు, మార్కెటింగ్ ఏడీ సునీల్‌వినయ్, వాణిజ్య పన్నుల అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చాగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించడం కోసమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం మండలంలోని నెలటూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు, ఊనగట్ల సొసైటీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. తహశీల్దార్ ఎం మెరికమ్మ, వ్యవసాయ అధికారి కే వేణుగోపాలకృష్ణ ఆమె వెంట ఉన్నారు.

ఎన్‌జీటీ ఉత్తర్వులు మీరొద్దు...

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఉత్తర్వులు, ప్రభుత్వ నిబంధనలు మీరి ఇసుక కార్యకలాపాలు చేయడం నిషిద్ధమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. రాత్రివేళలో ఇసుక తవ్వకాలు నిర్వహించరాదని, అనుమతి పత్రాలు లేకుండా రవాణాచేస్తే శిక్షార్హులని, అక్రమ నిల్వలు చేయరాదన్నారు. కాగా జిల్లాలో ఈనెల 5న రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాచేస్తున్న ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, అదేవిధంగా అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి డి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.

ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య.. చికిత్స పొందుతూ మరొకరి మృతి

నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

తల్లిపాలే.. అసలైన వ్యాక్సిన్!



డాక్టర్ బి.జయరామ్‌జీబాబు



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఎస్‌బీఎస్‌యూ యూనిట్‌లో అత్యవసర వైద్యసేవలు.. వైద్య సేవల కోసం వచ్చిన శిశువు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం ఎన్నో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే పుట్టిన బిడ్డకు ఏ అత్యవసర సేవలు అవసరమైనా అందించేందుకు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య విభాగం ఉంది. న్యూబోర్న్ స్టెబిలేషన్ యూనిట్ (ఎన్బీఎస్‌యూ)లో అత్యాధునిక వైద్య పరికరాలు, సేవలు అందించేందుకు వైద్య నిపుణులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఒక్క అమలాపురం ప్రాంతానికి చెందినవారే కాకుండా రాజోలు, పి.గన్నవరం, అల్లవరం వంటి ప్రాంతాల ప్రభుత్వ వైద్యశాలల నుంచి సైతం శిశువులను తీసుకువస్తున్నారు. ఎన్బీఎస్‌యూలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా కామెర్లతో బాధపడే శిశువుల కోసం ఫొటోథెరపీ ఉంది. ఫొటోథెరపీ శిశువుకు మందులా పనిచేసి ఆ వ్యాధిని తగ్గిస్తుంది. ఇక ఆక్సిజన్ అందక ఇబ్బంది పడే శిశువుల కోసం సిపాప్ యంత్ర పరికరం అందుబాటులో ఉంచారు. ఇన్ఫెక్షన్లు, ఆయాసం వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు వార్మర్స్ ఫెసిలిటీ చేసే వైద్య పరికరాలున్నాయి. అత్యల్పంగా బరువు ఉన్న శిశువుల కోసం ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. కిలో, కిలోన్నర బరువు ఉన్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని గుర్తించి మెరుగైన వైద్య సేవలకు మాత్రమే స్పెషల్ ఎన్బీఎస్‌యూ ఉన్న కాకినాడ జనరల్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తారు. అటువంటి కేసులు చాలా తక్కువ. ఏడాది కాలంలో ఒక్క శిశు మరణం కూడా సంభవించలేదని ఎన్బీఎస్‌యూ విభాగ వైద్యులు డాక్టర్ బి.జయరామ్‌జీబాబు తెలిపారు. ఎన్బీఎస్‌యూలో నెలకు 60 నుంచి 70 మంది శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని, కొద్దిపాటి అనారోగ్య సమస్యలు ఉన్న వారికి కూడా ఒకట్రెండు రోజులు వైద్యసేవలు అందించడం వల్ల నెలకు అడ్మిషన్ల సంఖ్య 120కు చేరిందన్నారు.

ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లీబిడ్డల బంధమే ప్రధానం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :అప్పుడే పుట్టిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రుపాలు తాగించాలి. బిడ్డను వెచ్చటి శుభ్రమైన దుస్తులతో కప్పిఉంచి తల్లికి దగ్గరగా ఉంచాలి. బిడ్డ నెలలు నిండకుండా పుడితే బిడ్డను ఇంక్యుబేటర్‌లో ఉంచాలి. ఆరోగ్య పరిస్థితిని గమనించాలి. సరైన బరువుతో బిడ్డ ఉందా లేదా చూడాలి. పిల్లలకు పుట్టిన వెంటనే వేయాల్సిన పోలియో మందులు, సూదిమందులు వేయమని డాక్టర్‌ను అడగాలి. సాధారణంగా అప్పుడే పుట్టిన పిల్లలకు ఆసుపత్రుల్లో ఒక ప్రత్యేకమైన కార్డు తీసుకొస్తారు. ఆ కార్డులో బిడ్డకు ఏ సమయంలో ఏ టీకా వేయాలి అనేది ఉంటుంది. ఈ టీకాలు బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, విటమిన్ కే ఇచ్చారా? లేదా అనేది తెలుసుకోవాలి. శిశువును తల్లి దగ్గరే పడుకోబెట్టి తల్లి స్పర్శ తగిలేలా ఉంచితే సరైన టెంపరేచర్ మెయింటైన్ అవుతుంది. చాలామంది తల్లులు, కుటుంబీకులు బిడ్డలకు పాలు తాగించడం, డైపర్లు మార్చడంపైనే దృష్టి ఉంచుతారు. కానీ ఇతర విషయాలను గమనించాలి. వినికిడి శక్తి బాగానే ఉందని తెలుసుకోవాలి. కంటిచూపు వస్తువులు, రంగులపైనా ఉందా లేదా అనేది గమనించాలి. ఆరోగ్యకరమైన ఎదుగుదల ద్వారానే తల్లి, బిడ్డ బంధం బలపడుతుంది. శిశువు బోర్లా పడడం, వెల్లకిలా పడుకోవడం లాంటివి వాళ్లకు వాళ్లే చేయాలి తప్ప బలవంతంగా మార్చకూడదు. పిల్లల ఏడుపు మొదటి ఆరు ఆరువారాల్లో ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుతుంది. ఏదైనా అసాధారణమైన మార్పు కానీ, లక్షణం కానీ కనిపిస్తే డాక్టర్ దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే బరువు సరిగా పెరుగుతున్నారా లేదా అనేది గమనించాలి. దీన్ని త్వరగా తెలుసుకోవాలి. ఆకలిని బట్టి ఆహారం ఇవ్వాలి. ఇదేం తప్పుకాదు. ప్రతి బేబీకీ 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. నీళ్లు, ఇంకేమీ ఇవ్వకూడదు. ఆవుపాలు, గేదెపాలు ఇవ్వకూడదు. మెడికల్లీ ఇండికేటెడ్ అయితేనే ప్రత్యామ్నాయ ఆహారాన్ని అందించాలి. ఆరు నెలల తర్వాత శిశువుకు తయారుచేసిన ఆహారం పెట్టాలి.

● తల్లికి అనేక ప్రశ్నలు..

అప్పుడే పుట్టిన బేబీకి అవసరాలు తక్కువగా ఉంటాయి. బేబీని తల్లి నుంచి వేరు చేసిన తర్వాత ఆ శిశువు తన టెంపరేచర్ తాను మెయింటెన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నెల రోజులపాటు జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో అరచేతులు, అరికాళ్లలో వేడి కోల్పోతారు. దీనికోసం మంచిగా దుస్తులు కప్పి ఉంచాలి. శిశువులో ఏ పార్టు అయినా వెచ్చగా ఉండాలి. టెంపరేచర్ సరిగా మెయింటైన్ చేయలేకపోతే షుగర్‌లెవెల్స్ పడిపోతాయి. ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. బ్రెస్ట్‌ఫీడ్ ముఖ్యం. బిడ్డకు ఫస్ట్ వ్యాక్సిన్ తల్లిపాలే అన్న సంగతి గుర్తుంచుకోవాలి.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సేవలివీ..



శిశువుల సంరక్షణ కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పీడియాట్రిక్స్ విభాగంలోని వైద్యబృందం అప్పుడే పుట్టిన శిశువులతోపాటు, చిన్నారులకు వైద్యసేవలందిస్తున్నారు. నవజాత శిశువుల కోసం లెవెల్ -2 కేర్‌గా పిలిచే అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ఎస్ఎన్‌సీయూ బ్లాకు అందుబాటులో ఉంది. తలసేమియా, హీమోఫిలియా వంటి కేసుల్లోనూ ఇక్కడ వైద్య సేవలు పూర్తి ఉచితంగా లభిస్తున్నాయి. జీజీహెచ్‌లో పిల్లల ఓపీ ప్రతిరోజూ సగటున 70 వరకూ ఉంటోంది. ఇన్‌పేషెంట్లు అడ్మిషన్లు 10 వరకూ జరుగుతున్నాయి. దీంతోపాటు డైస్ (డీఈఐసీ) కేంద్రం ద్వారా ముందస్తుగానే చిన్నారుల్లో వినికిడి, ఇతర వైకల్యాలు, శారీరక లోపాల గుర్తింపు ప్రక్రియ సైతం చేపడుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మోహన్‌చంద్ర మాట్లాడుతూ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలతోనే తల్లీ, బిడ్డ బంధం బలపడుతుందన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వయస్సు వచ్చే వరకూ శిశువుకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరమని చెప్పారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పిల్లల డాక్టర్‌ను సంప్రదించాలని, రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మోహనచంద్ర పేర్కొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న మరణాల రేటు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చంటిబిడ్డకు దివ్య ఔషధం తల్లి పాలు. అంటే బిడ్డతోపాటు తల్లి ఆరోగ్యమూ ముఖ్యమే. కానీ తల్లులు పోషకాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది 26,732 మంది శిశు జననాలుండగా, 284 మంది శిశువులు మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో పది మంది మృత్యువాతపడ్డారు. దీంతో శిశు మరణాల రేటు 1.06 శాతంగా నిర్ధారించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 16,166 శిశు జననాలకుగాను 179 మంది మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో 11 మంది మృతి చెందారు. శిశు మరణాల రేటు 1.17 శాతంగా నిర్ధారించారు. ఇది ఆందోళన కలిగించే విషయం. తల్లి హైరిస్క్ ప్రెగ్నెన్సీ, చిన్న వయస్సులో పెళ్లిచేయడం, మేనరికం, పోషకాహార లోపం వంటి కారణాలతో శిశు మరణాలతోపాటు మాతృమరణాలూ సంభవిస్తున్నాయి. అయితే కాకినాడ జీజీహెచ్‌లోని పిడియాట్రిక్స్ (చిన్న పిల్లల) విభాగం రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రులకంటే అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ (ఎస్ఐసీయూ) నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (నవజాత శిశు సంరక్షణ కేంద్రం) చంటి పిల్లలకు పునర్జన్మను ప్రసాదించేదిగా ఉంది. ఇక్కడ నిష్ణాతులైన వైద్యులు 24 గంటలపాటు సేవలందిస్తున్నారు.

ఎంతోమంది శిశువులకు పునర్జన్మ



జీజీహెచ్ పిడియాట్రిక్స్ విభాగంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లల వరకు వైద్యం అందిస్తున్నాం. ముఖ్యంగా ఈ విభాగంలో ఎస్ఐసీయూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ తక్కువ బరువు ఉన్న శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు, పచ్చకామెర్లతో పుట్టిన శిశువులకు ప్రత్యేక వెంటిలేటర్‌లు, వార్మర్ల సహాయంతో ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం. అనంతరం పీఐసీయూలో ఉంచి ప్రత్యేక వైద్యచికిత్స అందిస్తున్నాం. ఇక్కడ అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఖరీదైన మందులు కూడా ఇస్తున్నాం. తద్వారా చిన్నారులు మెరుగైన వైద్యచికిత్స పొంది ఆరోగ్యవంతులవుతున్నారు. ఇక్కడ పిడియాట్రిషియన్లు, నియోనటాలజిస్టులు, పిడియాట్రిక్ సర్జన్లు అందుబాటులో ఉన్నారు.

- డాక్టర్ డి.మాణిక్యాంబ, హెచ్‌వోడీ, కాకినాడ జీజీహెచ్

మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు.. 7 నెలల్లో 49 మంది మృతి

మరో 46 మందికి గుండె జబ్బులు

బలహీనంగా జన్మించినవారు 113 మంది

మరణాల నిష్పత్తి 3.41 శాతం


చింతూరులో మృతి చెందిన పసిబిడ్డ (ఫైల్)

చింతూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తల నుంచి వైద్యుల వరకు నిత్య పర్యవేక్షణతో కూడిన సేవల్లో నిమగ్నమవుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ మన్యంలో శిశు మరణాలను మాత్రం నిలువరించలేకపోతున్నారు. చింతూరు డివిజనులో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 1435 మంది తల్లులు తమ బిడ్డలకు జన్మనిచ్చారు. కాగా వీరిలో 49 మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. అంటే 3.41 శాతం మరణాల రేటు నమోదైనట్టు అధికారిక గణాంకాలే స్పష్టంచేస్తున్నాయి. నమోదుకాని మరణాలు కూడా ఉండి ఉంటాయన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఇక ఒక్క చింతూరు ఏరియా ఆసుపత్రిలోనే జనవరి నుంచి అక్టోబరు వరకు 689 మంది జన్మించారు. వీరిలో 46 మంది చిన్నారులకు గుండె జబ్బులు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. మరో 113 మంది చిన్నారులు సాధారణ బరువు రెండున్నర కేజీలు కాగా అంతకంటే తక్కువ బరువుతో పుట్టారు. ఇందుకు ప్రధాన కారణం పౌష్టికాహారలోపమేనని చెబుతున్నారు. చింతూరు డివిజనులో 10 ప్రాథమిక వైద్యశాలలు, ఒక ఏరియా ఆసుపత్రితోపాటు ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటరు, ప్రత్యేక నవజాతి నవజాతి శిశు చికిత్స కేంద్రం కూడా ఉంది. మరోవైపు 266 ప్రధాన అంగన్వాడీ, 166 మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. చింతూరులోని ప్రత్యేక నవజాతి శిశువైద్య శిబిరం ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 0 నుంచి 30 రోజుల వయస్సు ఉన్న 334 మందికి చిన్నారులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఒక మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి మొదలు బిడ్డకు 3 సంవత్సరాలు వయస్సు వచ్చేంత వరకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. వీటిలో బాలసంజీవని కిట్, టేక్ హోం రేషను వరకు ఉన్నాయి. ఇక బిడ్డకు 3 సంవత్సరాల వయస్సు దాటిన నుంచి అంగన్వాడీ కేంద్రంలోనే ఆయా చిన్నారులకు ప్రతిరోజు గుడ్డు, పాలుతోపాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. ఇన్ని వసతులు కల్పిస్తున్నా శిశుమరణాలు మాత్రం ఆగడంలేదు. గుండె జబ్బులు, రక్తహీనత, శ్వాసకోస ఇబ్బందులు బిడ్డల్ని పట్టి పీడిస్తున్నాయి.

కాకినాడలో శిశుగృహ ద్వారా పిల్లల సంరక్షణ


కె.ప్రవీణ, మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారిణి, కాకినాడ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ సాధికారిక అధికారుల వారి సంరక్షణలో శిశుగృహ నడుస్తోంది. కాకినాడ అశోక్‌నగర్‌లో శిశుగృహ ఉంది. అవాంఛనీయ గర్భం దాల్చి పిల్లలు వద్దు అనుకున్నవారు, శిశువును పెంచి పోషించే స్థోమత లేనివారు, ఎవరికైనా దత్తత ఇచ్చేయాలని అనుకున్నవారు, అనాథ పిల్లలు, నిరాదరణకు గురైన పిల్లలు, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, పార్కు, ఆసుపత్రులు, చెత్తకుప్పల్లో వదిలేసిన శిశువులు, తప్పిపోయిన పిల్లలను శిశుగృహలో సంరక్షిస్తూ వారి యోగక్షేమాలు చూస్తుంటారు. ఎవరైనా అనధికార దత్తత తీసుకున్నా ఆ సమాచారాన్ని వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు 100 లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారిని రక్షించి బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి బాలల సంక్షేమ సమితి ఆదేశాలతో శిశుగృహ, బాలల రక్షితగృహాల్లో సంరక్షణ కల్పించి ప్రత్యేక దత్తత వనరుల సంస్థ(కారా), న్యూఢిల్లీ వారి నిబంధనల ప్రకారం చట్టపరంగా దత్తత ఇస్తారు.2015 నుంచి ఇప్పటివరకు శిశుగృహ ద్వారా సంరక్షించిన పిల్లలను విదేశీ దత్తతకు-ఆడపిల్లలు 50మంది, మగపిల్లలు 23మంది. స్వదేశీ దత్తతకు ఆడపిల్లలు 10మంది,మగపిల్లలు ముగ్గురిని దత్తత ఇచ్చామని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి కె.ప్రవీణ తెలిపారు.

నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం



కేన్సర్.. కబళిస్తోంది!

● పేద, మధ్య తరగతి వారి జీవితాలు అతలాకుతలం

● అవగాహనతోనే కేన్సర్ వ్యాప్తికి చెక్ ● అందుబాటులో వైద్య సేవలు

(జీజీహెచ్(కాకినాడ)/సర్పవరం జంక్షన్/ రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి):

పూర్వం అరవై ఏళ్లు దాటినవారు కేన్సర్ వ్యాధి బారినపడేవారు. కేన్సర్ వ్యాధికి గురైతే ప్రాణం కోల్పోతామన్న భయందోళన ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మెరుగైన చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేన్సర్ మహమ్మారి ఏటేటా విస్తరిస్తూ ఉండడమే విషాదం. చిన్నా పెద్దా అనే వయసుతో తేడా లేకుండా ఈ వ్యాధి బారిన పడుతుండడం భయాందోళనకు గురిచేస్తోంది. ప్రజల మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశ పారపర్యం వంటి కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇక కేన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే వైద్యులు రేడియేషన్, కీమోథెరపీ చికిత్స ద్వారా విస్తరించకుండా నివారిస్తున్నారు. నిజానికి కేన్సర్ అంటే నిశ్శబ్ద ఉపద్రవం. తెలుసుకునేలోపే అది ముదిరిపోయి ప్రాణాలను హరిస్తుంది. కేన్సర్ తొలిదశలో ఏమీ తెలియదు. ఏదైనా స్కాన్ చేయించుకుంటే తప్ప బయటపడదు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందుగానే తెలుసుకుంటే దాని నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బ్రెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి కేన్సర్, ఓవెరీ కేన్సర్, కొలన్ కేన్సర్, సర్‌కోమా కేన్సర్, చర్మ కేన్సర్ (స్కిన్), మూత్రాశయం (ప్రోస్టేట్) కేన్సర్, కొలోన్/రెక్టం (పెద్ద పేగు భాగం) కేన్సర్, కిడ్నీ కేన్సర్, బ్లడ్ కేన్సర్, అండాశయ కేన్సర్, కడుపు కేన్సర్, నోటి కేన్సర్, ఎముకల కేన్సర్, కాలేయ కేన్సర్ తదితర రకాల బారిన రోగులు పడుతున్నారు. అయితే ఇప్పటికీ కొన్ని కేన్సర్లు మొండిఘటాలుగానే ఉంటున్నాయి. ప్రాంకియాట్రిక్ కేన్సర్, బ్రెయిన్ కేన్సర్, లివర్ కేన్సర్, కడుపులో, ఊపిరితిత్తుల్లో వచ్చే కేన్సర్లు ప్రాణాంతకమేనని వైద్యులు చెబుతున్నారు.

● మహిళల్ని వేధిస్తున్న బ్రెస్ట్ కేన్సర్

మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ కేన్సర్ బారిన పడుతున్నారు. రొమ్ములపై నొప్పిలేని గడ్డలు ఏర్పడినా, మార్పులు కనిపించినా, గడ్డలు గట్టిగా ఉన్నా, అధికంగా వచ్చినా వెంటనే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి. లేదంటే బ్రెస్ట్ కేన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. రొమ్ముల వాపు, చనుమొనలు నొప్పి, చనుమొనల ఉంచి స్రవాలు కారడం, లోపలకి కుచించుకుపోవడం, ఎర్రగా మారడం వంటి లక్షణాలను రొమ్ముకేన్సర్‌గా భావించాలి. అధిక సంఖ్యలో మహిళలు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముందస్తుగా గుర్తిస్తే కోలుకోవడం సులభం కూడా.

● తొలి దశలోనే అడ్డుకట్ట..

కేన్సర్లకు తొలిదశలోనే అడ్డుకట్ట వేయాలి. శరీరంలో ఎక్కడో ఒకచోట మొదలై చాపకింద నీరులా ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. ఎన్నో అనుమానిత లక్షణాలు కనిపిస్తాయి. కాస్త జ్వరంగా అనిపించడం, ఆకలి మందగించడం, నీరసం, బరువు తగ్గడం వంటి సర్వసాధారణ లక్షణాలే ఉంటాయి. ఈ లక్షణాలు పెద్దగా పట్టించుకునేలా ఉండవు. దీంతో కేన్సర్‌ను పసిగట్టేలోపే ఇతర భాగాలను కబళిస్తాయి. నిజానికి కేన్సర్లపై కనీస అవగాహన లేకపోవడం, క్రమంతప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోకపోవడం కేన్సర్‌ను గుర్తించలేకపోవడానికి కారణం. సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాలు కాపాడవచ్చు. మంచి చికిత్స అందిస్తే మమూలు జీవితాన్ని హాయిగా గడిపేయవచ్చు. ఎక్సరే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, బేరియం మీల్ స్టడీ, ఎముక స్కాన్, పెట్ స్కాన్, స్పెక్ట్ స్కాన్, యూఎస్‌జీ, బయాప్సీ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా కేన్సర్‌ని గుర్తించి నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా వ్యాధి లక్షణాలు కనిపించకపోయినా కేన్సర్ కోసం ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే వీలుంది.


కాకినాడ జీజీహెచ్ అంకాలజీలో ఓపీ రద్దీ

● రిస్కుకు దూరంగా ఉండాలంటే..

పొగాకు నమలడం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన బరువు మెయిన్‌టైన్ చేయడంతోపాటు మంచి ఆహారం తీసుకోవాలి. పళ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. యోగా, శారీరక ఎక్సర్‌సైజులు వంటి ఫిజికల్ యాక్టివిటీ నిత్యం ఉండాలి. ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, అల్ట్రా వయిలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కాకపోవడం, క్రమం తప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా రిస్కుకు దూరంగా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

● కాకినాడ జీజీహెచ్‌లో సేవలు..

ఉభయగోదావరి జిల్లాలోనే ఆరోగ్య వరప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవలు కోసం విచ్చేస్తుంటారు. ఇక్కడ కేన్సర్ రోగులకోసం రేడియేషన్ అంకాలజీ యూనిట్ ఏర్పాటుచేశారు. రేడియేషన్ అంకాలజిస్ట్ యూనిట్ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో రోగులకు సేవలు అందిస్తున్నారు. కేన్సర్ వార్డుకి నిత్యం 30 మంది రోగులు వైద్య చికిత్సల కోసం విచ్చేస్తున్నారు. నిత్యం 8 నుంచి 10 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా వార్డులో చేరుతున్నారు. 60 పడకల సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఉంది. ఇక్కడకు విచ్చేసిన రోగులకు రేడియోథెరపీ, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. ఇక్కడకు విచ్చేసిన రోగులకు బెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి, ఓవెరీ, కొలన్ కేన్సర్, సర్కోమా కేన్సర్ వంటి వాటికి చికిత్స అందిస్తున్నారు. అయితే జీజీహెచ్ కేన్సర్ యూనిట్ విభాగంలో వైద్య పరికరాల కొరత ఉంది. లీనియర్ ఎసెలిరేటర్ పరికరం ఉంటే అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అందించే వెసులుబాటు ఉంటుంది. దీని ఖరీదు రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. అలాగే రొమ్ము కేన్సర్‌ని గుర్తించే మామోగ్రామ్ అందుబాటులో లేదు. హైడ్రోఎస్ఆర్ రేట్ బ్రేకేథెరపీ మిషన్ అందుబాటులో లేదు. ఇవన్నీ ఉంటే అడ్వాన్స్‌డ్ కేన్సర్ చికిత్స అందించేందుకు వీలుంటుంది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే..



కేన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. కేన్సర్‌పై గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణవాసుల్లోనూ సరైన అవగాహన లేక వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. శరీరంలో అసాధారణ రీతిలో కణితులుంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. కేన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటే అన్నివిధాలా మంచిది. మద్యపానం, ధూమపానం, వంశపారం పర్యం, ఆహారపు, జీవనశైలిలో మార్పుతో వచ్చే అవకాశం ఉంది. కేన్సర్ రోగులకు జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. రేడియేషన్, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు, మందులు అందిస్తున్నాం. అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం పలు వైద్య పరికరాలు కావాలి. వీటి మంజూరుకోసం సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ద్వారా కలెక్టర్‌కు పంపడం జరిగింది.

- డాక్టర్ పి. శ్రీనివాసన్, హెచ్‌వోడీ, జీజీహెచ్ అంకాలజీ యూనిట్ రేడియేషన్ అంకాలజిస్ట్

● రాజమహేంద్రవరంలో జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు

కేన్సర్‌కు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేన్సర్‌కు వైద్యచికిత్సలు అందించే అంకాలజీ స్పెషలిస్టులను నియమించింది. దీంతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సర్జరీ, కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సర్జరీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడ గత ఆరు నెలల కాలంలో తల, మెడ సంబంధిత కేన్సర్‌లకు సంబంధించి 9 కేసుల్లో, గైనకాలజికల్ సంబంధిత కేన్సర్లు 11, గ్యాస్ట్రో ఇంటెస్టియల్ కేన్సర్లు నాలుగు, స్కిన్ కేన్సర్ ఒకదానికి విజయవంతంగా సర్జరీ చేశారు. అలాగే 60 కీమోథెరపీ వైద్యసేవలు అందించారు. వీటితోపాటు ప్రతినెలా రెండవ బుధవారం కేన్సర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల వారు రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో అందిస్తున్న కేన్సర్ వైద్యసేవలతోపాటు స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ కోరారు. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన బరువుతోపాటు మంచి ఆహారం తీసుకోవాలని, క్రమంతప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ రిస్కుకు దూరంగా ఉండొచ్చని ఆమె చెప్పారు.


హరి తాడోజు గీసిన డోనాల్డ్ ట్రంప్ తైలవర్ణ చిత్రం

చిత్రం భళారే..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిరోహించబోతున్న డోనాల్డ్ ట్రంప్‌కు అభినందనలు తెలుపుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు హరి తాడోజు ట్రంప్ తైలవర్ణ చిత్రాన్ని గీసారు. బుధవారం పెయింటింగ్‌ను ఆవిష్కరించి ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 8న నిర్వహించనున్నామని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి జడ్పీ చైరన్, ఆయా సంఘాల చైర్మన్‌ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. దీనికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

'ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి'

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


పీడీజే సునీత అందజేసిన హెల్మెట్లతో న్యాయవాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో విధిగా హెల్మెట్ ధరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్ పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, న్యాయవాదులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేశామన్నారు. హెల్మెట్లు ధరించడంలో అలసత్వంవల్ల తలకు బలమైన గాయాలై మృత్యువాతపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీఎస్ఆర్ కింద బ్యాంకులు, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఏపీ పేపర్‌మిల్ యాజమాన్యాలు అందజేసిన 398 హెల్మెట్లను ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు, జూనియర్ న్యాయవాదులకు వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్మెట్, సీటుబెల్టు వంటివి ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడతా యని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి. రమేశ్, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాస్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్

ఎస్‌హెచ్‌జీపై ఒకరోజు శిక్షణలో మెప్మా పీడీ ప్రియంవద

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెప్మా సంఘం సభ్యుల డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్ దిశగా మెప్మా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీడీ బి.ప్రియంవద అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో బుధవారం మెప్మా కార్యక్రమాలు డిజిటలైజేషన్ ప్రక్రియపై తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మెప్మా సీవోలు, రిసోర్స్ పర్సన్స్ సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ అప్ లోడింగ్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. సమావేశంలో ప్రియంవద మాట్లాడుతూ పట్టణాల పరిధిలో స్వయం సహాయ సంఘాలు, సమైక్యలు పటిష్టత కోసం వారి పూర్తి సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యుల డేటా అంతా పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరవేసేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘం సభ్యులు, సమైక్యలు వారి జీవన విధానంలో మార్పులతోపాటు మెరుగైన ఉపాధిని కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్లు, టీఎంసీలు, పి.రవిశంకర్, కె.మోహన్ కుమార్, టీ.అనంతలక్ష్మి, డి.మంగాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద



గేట్లను ఎత్తి స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

'తూర్పు' డెల్టాలో స్కవర్ స్లూయిస్ ఆపరేషన్

ధవళేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా పరిధిలో బుధవారం స్కవర్ స్లూయిస్‌లో ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. ఉదయం నిర్ణయించిన ముహూర్తం సమయానికి సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు స్కవర్ స్లూయిస్‌లోని నాలుగు గేట్లను ఎత్తి వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో 7వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించినట్టు హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. డి.ఆనంద్‌బాబు, ఏఈ సాయిరాం సునీల్, సిబ్బంది పర్యవేక్షించారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.08 కోట్లు

ఆత్రేయపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ప్రసాదరాజు, కిరణ్ సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.84,58,208, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,75,899... మొత్తం రూ.1,08,34,107 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 700 గ్రాములు, విదేశీ కరెన్సీ లభించిందని ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,06,490 వచ్చింది. లెక్కింపులో గ్రామస్తులు, దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు

శలపాకలో ముగ్గురు వ్యక్తుల హత్య కేసులో...

ఐదుగురు అరెస్టు

నిందితులు రిమాండ్‌కు తరలింపు

సర్పవరం జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో దీపావళి రోజు రాత్రి ముగ్గురు వ్యక్తులను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు వెల్లడించారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక దళితపేటకు చెందిన బత్తుల చిన్నయ్య, అతడి ఇంటి ఎదురుగా నివసిస్తున్న పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబం మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీపావళి రోజైన అక్టోబరు 31వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో బత్తుల చిన్నయ్య, కుమారుడు రమేష్, సోదరుడు రాజును నాగేశ్వరరావు, భార్య బేబీ, ముగ్గురు కుమారులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ కలిసి ఇనుపరాడ్డు, మంచం పట్టి, కర్రలతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. తీవ్ర గాయాలతో తప్పించుకున్న బత్తుల శ్రీను కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రత్యక్ష సాక్షి, బాధితుడి వాంగ్మూలం మేరకు ఐదుగురు నిందితులను మంగళవారం సాయంత్రం కాకినాడలో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు కోర్టులో లొంగిపోయేందుకు లాయర్ వద్దకు వెళ్తున్న సమయంలో అరెస్టు చేశారు. వివాహితపై అసభ్య పదజాలంతో దూషించడం, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే నిందితులు దుర్మార్గంగా ముగ్గురిని చంపినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



మండపేటలో దగ్ధమైన కారు ఇదే

పార్కింగ్‌లో పెట్టిన

కారులోంచి మంటలు

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఒక కారు దగ్ధమైంది. వాసవీమాత ఆలయ పార్కింగ్ ప్రదేశంలో బుధవారం సాయంత్రం నిలిపి ఉంచిన ఒక కారు నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే మండపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. కారు ఎందుకు దగ్ధమైంది, అది ఎవరిదనే విషయమై అగ్నిమాపక సిబ్బంది ఆరా తీశారు. కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన శీలం ప్రసాద్‌కు చెందిన కారు (టాటా మాంజా ఏపీ05-6655)గా గుర్తించారు. ఎవరైనా దుండగులు నిప్పుపెట్టారా? లేక సాంకేతికలోపంతో దగ్ధమైందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రూ.1.5 లక్షలు నష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. కారు యజమాని స్టూడియో నిర్వహిస్తాడని, వాసవీ మాత ఆలయ పార్కింగ్ పెట్టి స్టూడియోకి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి హనుమంతరావు తెలిపారు. పార్కులో తీసిన చెత్త పోగుపెట్టి ఉండగా అందులో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పారేయడం వల్ల మంటలు చేలరేగి కారుకు వ్యాపించి ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య

చికిత్స పొందుతున్న మరో మహిళ మృతి

ఉండ్రాజవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి పేలుడు సంభవించిన ఘటనలో చికిత్స పొందుతూ బుధవారం మరొకరు మృతి చెందారు. సంఘటన జరిగిన రోజున ఇద్దరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఒక్క రోజే చికిత్స పొందుతున్న వారిలో నలుగురు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు(45) ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఐదుగురూ మరణించారు. మృతుల సంఖ్య ఏడుగురికి చేరింది.

మంటల్లో చిక్కుకున్న మహిళ... చికిత్స పొందుతూ మృతి



రాజవొమ్మంగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ మంగళవారం రాత్రి మృతి చెందింది. మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన గుర్రపల్లి సరస్వతి (55) దీపావళి రోజు కిరాణా షాపు వద్ద మంటల్లో చిక్కుకుంది. కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాట్రేనికోన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొర పొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



ముమ్మిడివరం పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ముమ్మిడివరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో డ్రగ్స్ ఆస్తి నేరాలకు సంబంధించి ఇప్పటివరకు తమ రేంజ్‌లో 7,500 కేసులు నమోదు చేశామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. రికార్డులను చూసి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోక్సో డ్రగ్స్, ప్రోపర్టీ నేరాలకు సంబంధించి నేరస్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు రేంజ్‌లో ఐదేళ్లలో ఆయా నేరాలకు పాల్పడిన 7,500 కేసులకు సంబంధించి నిందితుల వివరాలు నమోదు చేసి వారి డేటా, వేలిముద్రలు, ఫొటోలను నిక్షిప్తం చేశామన్నారు. ప్రోపర్టీ నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను గుర్తించేందుకు నిరంతర నిఘా పెట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను మరో నెల కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మహిళా రక్షణకు సంబంధించి ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు, మెన్ పోలీసులు, సచివాలయ పోలీసులతో కలిసి ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి ఈవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నామని... సోషల్ మీడియా వల్ల ప్రభావితమైయువత నష్టపోతున్నారని, వారికి కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రత్యేక ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచామని, నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేనివారు, ఆ నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యను నిర్భయంగా చెప్పవచ్చన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి స్కూటర్లపై 10, 15 కిలోలు తీసుకువచ్చి లూజు విక్రయాలు జరుపుతున్నారన్నారు. వారిపై నిఘా ఏర్పాటుచేసి కేసులు పెడుతున్నామని, అవసరమైతే పీడీ యాక్టు కూడా నమోదు చేస్తామన్నారు. అనాతవరంలో 2022లో జరిగిన పెదపూడి రవికుమార్ హత్య కేసును, 2023లో జరిగిన షేక్ శామ్యూల్ బాషా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించేందుకు అమలాపురం డీఎస్పీతో చర్చించామని చెప్పారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసే ఫ్లెక్సీల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, తద్వారా సమాజంలో అందరూ నష్టపోతున్నామన్నారు. దీనిపై ప్రజల్లో అవేర్‌నెస్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్లెక్సీల వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయకుండా చూడాలని ఎస్పీలకు ఆదేశాలిచ్చామన్నారు. ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో ఫ్లెక్సీలు పెట్టవలసి వస్తే ఉదయం కట్టి సాయంత్రం తీసివేసేలా గ్రామపంచాయతీలకు సూచనలిచ్చామన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరుల సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

మా కుమార్తె ఆచూకీ తెలపండి

కళాశాల నుంచి అదృశ్యమై 16 రోజులు గడుస్తోంది... పోలీసులు, కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోతే ఎవరిని ఆశ్రయించాలి

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మా కుమార్తె అదృశ్యమైంది. 16 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా మా గోడు పట్టించుకున్న వారే లేరు. బిడ్డ బతికి ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితి. దయచేసి మా బిడ్డ ఆచూకీ తెలపండి' అంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన నెల్లి నూకరత్నం-రామకృష్ణ దంపతులు బుధవారం ప్రత్తిపాడులో విలేకరుల ఎదుట తమ గోడు వినిపించారు. తమ కుమార్తె ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కళాశాలకు వెళ్లి వచ్చే సమయంలో కొడవలికి చెందిన బొడ్డు జాన్ అనే వ్యక్తి వేధించేవాడని తెలిపారు. సెప్టెంబరు 6న అతడు తమ ఇంటికి వచ్చి కుమార్తెపై అత్యాచారయత్నానికి పాల్పడడంపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. అక్టోబరు 22న తమ కుమార్తెను కళాశాల నుంచి జాన్ తీసుకెళ్లిపోయాడని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అదృశ్యమై 16 రోజులైనా ఎవరూ పట్టించుకోవట్లేద ని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలుగజేసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ-నూకరత్నం దంపతులు



కడియం దేవీచౌక్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

నినదించిన ప్రజా సంఘాలు

కడియంలో కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం

కడియం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో వివాహితపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడియం బస్టాండు నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు బుధవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి డిమాండ్ చేశారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వారికి ఉన్న మానసిక వికలాంగురాలైన కుమార్తె బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మద్యం, పోర్న్ వంటివి పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు. ప్రదర్శనలో యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా, సీనియర్ నాయకులు సావిత్రి, అంగన్వాడీ నాయకురాళ్లు సుజాత, వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, సుబ్బలక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, పద్మ, సీఐటీయూ నాయకుడు పూర్ణిమరాజు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

11న కలెక్టరేట్ల వద్ద ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టరేట్‌ల ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేస్తారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడిసరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని కోరారు. 11వ తేదీన అన్ని రంగాల కార్మికులు పనులు నిలుపుదల చేసి కలెక్టరేట్‌కు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉదయ్ శ్రీనివాస్

ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 79వ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ ఏడాది భారతదేశం నుంచి 9 మంది యువ ఎంపీలను ఆహ్వానించగా అందులో ఉదయ్ శ్రీనివాస్‌కు అవకాశం దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన మొట్టమొదటి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కావడం గమనార్హం. ప్రతిష్ఠాత్మక ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఉదయ్‌శ్రీనివాస్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. మేధావుల సూచనలు, సలహాలతో రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'నన్నయ'లో నేడు సాంస్కృతిక వైభవం సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగా కామర్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారు. 8వ తేదీన జరిగే ముగింపు సభకు మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరవుతారు. సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్రాలను సమర్పిస్తారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా అందరి కృషితో సదస్సును విజయవంతం చేయాలని వీసీ శ్రీనివాసరావు కోరారు.



నీలాపు రేష్మ

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు

రేష్మ ఎంపిక

అమలాపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని నీలాపు రేష్మ ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ పోటీలు పెనుగొండ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన రేష్మ స్వర్ణ పతకం దక్కించుకుంది. డిసెంబరు 26 నుంచి పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో రేష్మ పాల్గొంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ నాకల శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆమెను అభినందించారు.



వంగలపూడి-రామచంద్రపురం మధ్య బస్సు ఆగిపోవడంతో కాలినడకన వెళుతున్న ప్రయాణికులు(ఫైల్)

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు

- బస్సు ఆగితే కాలినడకే గతి
- గుంతల రోడ్లతో ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

సీతానగరం, నవంబరు 6: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం.. సుఖవంతం అనే స్లోగన్‌కు ఆర్టీసీ బస్సులతో పాటు దీనికి కూడా కాలం చెల్లిందా అనిపిస్తోంది. కాలం చెల్లిన బస్సులతో ఆర్టీసీ కాలక్షేపం చేస్తుంటే గుంతల రోడ్లలో బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు ఎక్కడ ఆగిపోతుందో తెలియదు గ్రామాల వద్ద ఆగితే పరవాలేదు. రెండూళ్ల మధ్యన ఆగిపోతే ప్రయాణికులకు కాలినడక తప్పడదం లేదు. వయస్సు రీత్యా అనారోగ్య రీత్యా బాధపడే వారు చిన్నారులతో మహిళలు మరీ ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారుగా రెండురోజులకు ఒక బస్సు ఆగిపోతోంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి ఈ మధ్య అనపర్తి మండలం, పులగుర్తి వద్ద స్టీరింగ్ పనిచేయక ఆర్టీసీ బస్సు పల్టీ కొట్టిన సంఘటనలో పలువురు గాయడగా, పురుషోత్తపట్నం-రామచంద్రపురం మధ్య బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు కాలినడకన వెళ్లిన సంఘటనలు తరచూ వినిపిస్తున్నాయి. సీతానగరం బస్టాండ్ గోకవరం డిపో పరిధిలో ఉందని చెబుతున్నా అక్కడి నుంచి ఒక్క బస్సుకూడా రాదు. అన్నీ రాజమహేంద్రవరం డిపో నుంచి వస్తున్నాయి. ఫిర్యాదులు ఎవరికి ఇవ్వాలో తెలియక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు

వీరలింకపల్లి గురుకుల పాఠశాల సమస్యలను

పవన్ దృష్టికి తీసుకెళ్తా

- జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్



గురుకుల పాఠశాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రమేష్

గోకవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం వీరలింకపల్లిలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. వీర లింకపల్లిలో గల అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆయన స్థానిక జనసేన నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో ఉన్న ఇబ్బందులను ఉపాధ్యాయుల నుంచి అడిగి తెలుసుకోవడంతోపాటు, విద్యార్థినిలతో ముఖాముఖి నిర్వహించారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడంలేదని, తాగునీటికోసం అవస్థలు ఎదుర్కొంటున్నామని, వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయాలని, కేర్ టేకర్ పోస్టును భర్తీచేయాలని, అదనపు గదులు ఏర్పాటుచేయాలని, బెడ్స్ కొరత ఉందని, తదితర సమస్యలను వారు రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ వీర లింకపల్లి గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

మస్తర్ల మాయాజాలంపై ముక్కినాడలో ముగిసిన విచారణ

- ఉపాధి కూలీలను విచారించిన డ్వామా ఏపీడీ



విచారణ నిర్వహిస్తున్న డ్వామా ఏపీడీ రాంప్రసాద్

రాజానగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజా నగరం మండలం ముక్కినాడలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో వెలుగు చూసిన అవకతవకలపై డ్వామా ఏపీడీ రాంప్రసాద్ రెండో రోజైన బుధవారం కూడా విచారణ నిర్వహించారు. ఈనెల 3న మస్తర్ల మాయాజాలం పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలోని కూలీలతోపాటుగా ఉపాధి పనులకు రాకుండా వేతనాలు డ్రాచేసిన మరికొంతమంది కూలీలను రాజానగరం ఇన్‌చార్జ్ ఏపీవో బాలరాజు, ఫిర్యాదుదారుల సమక్షంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ గిరిధర్ పాల్పడిన అవినీతి, అక్రమాలు, ఆశ్చర్యకరమైన పలు విషయాలను ఉపాధి కూలీలు విచారణాధికారికి వివరించారు. మూడు, నాలుగేళ్ల కిందట పనులు మానేసిన కూలీలు సైతం ప్రస్తుత ఏడాదిలో ఉపాధి పనులు చేస్తున్నట్లుగా మస్తర్లు నమోదు చేసి వేతనాలు డ్రా చేసినట్లుగా విచారణాధికారి గుర్తించారు. గత కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వందలాది పనిదినాలు చూపించినట్లుగా మస్తర్లు నమోదు చేసి, వేతనాలు డ్రా చేయడం వంటి విషయాలు వెలుగుచూశాయి. అప్పుడప్పుడు గ్రామంలోని ఫినో పేమెంట్స్ బ్యాంకు వద్దకు తీసుకెళ్లి వేలిముద్రలు వేయడం తప్ప తమకు ఎంత వస్తుందో, ఏమి జరుగుతుందో కూడా తెలియదని కూలీలు విచారణాధికారి వద్ద వాపోయారు. విచారణలో భాగంగా కూలీలు వివరించిన వివరాలను లిఖితపూర్వకంగా రికార్డు చేశారు. కాగా విచారణ నివేదికలను డ్వామా పీడీ నాగమహేశ్వరరావు సమర్పించడం జరుగుతుందని విచారణాధికారి రాంప్రసాద్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధి కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన

వ్యక్తి మృతి

అనపర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్తలో ఈనెల 2న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం పులగుర్త గ్రామానికి చెందిన యార్లగడ్డ యాకోబు(45) మద్యానికి బానిసయ్యాడు ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను తాళలేక ఈనెల 2న పురుగుల మందు తాగడంతో బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా తయారీ

శిబిరాలపై దాడి

- బెల్లం ఊట స్వాధీనం

రంగంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం ఈలకొలను గ్రామ సమీపంలో జీడిమామిడి తోటలో నాటుసారా తయారీకి సంబంధించిన బెల్లం ఊటను పట్టుకొని ధ్వంసం చేసి నిందితుడిని అరెస్ట్ చేశామని ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అడబాల సతీష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఈఎస్ఎఫ్‌టీ బృందంతో కలిసి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారులో జీడిమామిడితోటలో నాటుసారా తయారీకి సిద్ధం చేస్తున్న 2 వేల లీటర్ల బెల్లం ఊటను గుత్తుల సూరిబాబు నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మంత్రి లోకేష్ స్ఫూర్తితో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తనలాంటి యువనాయకులందరికీ మంత్రి లోకేష్ ఆదర్శమని ఆయన స్ఫూర్తితోనే నిరుద్యోగయువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు, సెలవులు లేకుండా మంత్రి లోకేష్ విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నారు. ఇదే తరహాలో తమ నేత సీఎం చంద్రబాబు గతంలో తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేలా కృషి చేసేవారని అన్నారు. రాజమహేంద్రవరంలో గతనెల 26న మెగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. అప్పుడు ఇచ్చినమాట ప్రకారం వందమందికి ఉచితంగా స్కిల్స్‌లో శిక్షణకు రిజిస్ట్రేషన్ చేపట్టామని ఇప్పటికే 58 మంది రిజిష్టర్ అయ్యారని చెప్పారు. ఎన్నిలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గడచిన ఐదునెలల్లో రాజమహేంద్రవరంలో రూ.6.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలో రాజమహేంద్రవరం ప్రాధాన్యతను పెంచుతూ వ్యాపారులు, వివిధ రంగాల ప్రముఖుల విజ్ఞప్తుల మేరకు రాజమహేంద్రవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి, ముంబైకి విమాన సర్వీసులు వచ్చేనెల నుంచి ప్రారంభిస్తునారన్నారు. దీనికి కేంద్ర విమానయనశాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి పూర్తిగా సహకరించారని చెప్పారు. రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఇందులో భాగంగా వీఎల్‌పురంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామని దానికి టెండర్లు సిద్ధమవుతున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ, మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు కొరుమిల్లి విజయశేఖర్, మాటూరి రంగారావు, టీ బాబీ, మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరంఆర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 80 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. నన్నయ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయుల సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

దివాన్‌చెరువు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అగిరిపల్లిలో జరుగుతున్న లీడర్‌షిప్ శిక్షణలో ప్రధానోపాధ్యాయుడు మృతికి సంతాపంగా రాజానగరం మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రంలో శిక్షణపొందుతున్న ఉపాధ్యాయులు బుధవారం కొద్దిసేపు మౌనం పాటించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న వెంటనే ఉపాధ్యాయులు అంతా శిక్షణ నుంచి బయటకు వచ్చి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు రెసిడెన్షియల్ శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. శిక్షణా కేంద్రం వద్ద 24 గంటలూ అంబులెన్సు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే శిక్షణా కేంద్రం ఏర్పాటుచేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ, శిక్షణా కేంద్రంఇన్‌ఛార్జి పి.రాంబాబు, పరిశీలకుడు అరవప్రభాకర్ హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు తరగతులకు హాజరయ్యారు.

కంబాలచెరువువద్ద వ్యాను ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్ సమీపంలో ఒక వ్యాన్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం గాదిరెడ్డినగర్‌కు చెందిన పొల్లేటి యేసు (36) బుధవారం రాజమహేంద్రవరం వచ్చి కంబాలచెరువు స్వతంత్ర పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన అరటిపండ్లు బండి వద్ద ఆగి వాటిని కొనుగోలు చేస్తుండగా ఒక వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈసంఘటనలో యేసు అక్కడికక్కడే మృతి చెందాడు, అతని పక్కనే ఉన్న వెంకటరమణ అనేవ్యక్తి గాయపడ్డారు. మృతుడు యేసుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న త్రీటౌన్ పోలీసులు యేసు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో

జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ సర్క్యులర్‌ను జారీచేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఈ ఉత్తర్వులు అమలయ్యేలా జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసర్, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌లు తగిన చర్యలు తీసుకోవాలని ఆ సర్క్యులర్‌లో జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ పి.ప్రశాంతిని ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీరామ్మూర్తి, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.పార్థసారథిలు కలిసి జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల శ్రీరామ్మూర్తి, కె.పార్థసారథిలు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలి'

కోరుకొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు కోటికేశవరం, శ్రీరంగపట్నంలో బుధవారం రైతులతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ఎస్.జయరామలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించి చిత్ర పటం, వివరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సులో చిత్రపటం ద్వారా గ్రామంలో జరుగుతున్న ప్రతి కార్యక్రమాన్ని చిత్రీకరించారు. వాటిపై అవగాహన చేసుకుని రైతులకు వివరించారు. గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను పర్యటించినప్పుడు రైతులు అధికంగా ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడుతున్నట్లు గ్రహించామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడి నేలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెకర్ వీరభద్రరావు, ఎం. బాబా వెంకన్న చౌదరి, పెద్ద సుబ్బారావు, ముంద్రు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టిలంకలో రాకాడ పండుగ

కడియం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కడియం మండలం పొట్టిలంకలో సెయింట్ దేవదాస్ ఫెనుయేలు బైబిల్ మిషన్ ప్రధాన మందిరం ఏసుక్రీస్తు రెండవ రాకాడ పండుగ రెవ. చిక్కాల పాల్‌దొరబాబు నిర్వహణలో ఆశీర్వాదకరంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం బైబిల్‌మిషన్ రెవ. స్టీఫెన్‌రాజు క్రీస్తు ఆగమనం గురించి బైబిల్ వాక్యాలు ఉపదేశించారు. రెవ. డా.దేవరపల్లి రతన్‌రాజు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఏసుక్రీస్తు మాటలతో భక్తి శ్రద్ధలతో జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో అరుణాపాల్, స్వరూపాపాల్, చిరంజీవి బేబి, దొర, జ్యోతి పాల్గొన్నారు.

చిరు సేవాసమితి సభ్యుల ఔదార్యం

కడియం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంకకు చెందిన చిరుసేవాసమితి సభ్యులు, నాగిరెడ్డి హనుమంతు, వారి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం ప్రియదర్శిని పాఠశాల పిల్లలను ఇంటికి పిలిచి భోజనాలు ఏర్పాటుచేశారు. ప్రతీ విద్యార్థికి అనంతరం మంచినీటి ప్లాస్కులు అందజేశారు. ఈ చిరుసేవాసమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గెడ్డం శివ, నాగిరెడ్డి హనుమంతు, నాగిరెడ్డి రాముడు, గట్టి శ్రీను, హరిబాబు పాల్గొన్నారు.

శ్రీకన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంఘం

గౌరవాధ్యక్షుడిగా కేశవభట్ల



కేశవభట్ల శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న రైల్వే ఎస్ఎమ్ రంగనాథ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లోని శ్రీకన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా కేశవభట్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. బుధవారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కేశవభట్లను ఎన్నుకున్నారు. కేశభట్ల శ్రీనివాస్ గతంలో రైల్వేచీఫ్ టిక్కెట్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ట్యాక్సీ, ఓనర్స్, డ్రైవర్స్, కార్మిక సంఘానికి తన వంతు సేవలు అందించే గురుతర బాధ్యతను అసోసియేషన్ అప్పగించింది. ఈసందర్భంగా కేశవభట్ల మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలతో పాటు వారి సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. కేశభట్ల శ్రీనివాస్‌కు రాజమండ్రి రైల్వేస్టేషన్ మేనేజరు రంగనాథ్, సీటీఐ సుంకరచంద్రమౌళి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, ఎస్ఐ లక్ష్మి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, టీటీఐ సతీష్‌బాబు, ట్రస్ట్ సభ్యులు ఏవీ నాగరాజు, చిటికెన సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, సంక్షేమ సంఘం నాయకులు బంగారయ్య, సెక్రటరీ రమేష్, ట్యాక్సీఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గన్నిరాజు జంక్షన్‌లో జనసేన నాయకులు బయ్యపునీడి సూర్య ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమం బుధవారంతో ముగిసింది. గత ఐదురోజులుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జనసేన నగరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ హాజరయ్యారు. పట్టభద్రుల ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఇప్పటివరకు 7వేల ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. జనసేనజిల్లా జాయింట్ సెక్రటరీ వైవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షులు గుత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నల్లంశెట్టి వీరబాబు, సిటీ కార్యదర్శి విన్నావాసు, సంయుక్త కార్యదర్శి ఫణి, నాయకులు తలారిశ్రీను, విక్టరీ వాసు, సింహాద్రి, సూర్యమిత్రబృందం సభ్యులుపాల్గొన్నారు.

అనపర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు కోసం అనపర్తి నియోజకవర్గంలో 8205 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అనపర్తి తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. అనపర్తి మండలంలో ఆన్‌లైన్ ద్వారా 1406, ఆఫ్‌లైన్ ద్వారా 1346 మొత్తం 2752మంది, బిక్కవోలు మండలంలోని ఆన్‌లైన్ ద్వారా 1858మంది, ఆఫ్‌లైన్ ద్వారా 309మంది మొత్తం 2167మంది, రంగంపేట మండలంలో ఆన్‌లైన్ ద్వారా 591మంది, ఆఫ్‌లైన్ ద్వారా 419మంది మొత్తం 1010మంది, పెదపూడి మండలంలో ఆన్‌లైన్ ద్వారా 1383 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 893మంది దరఖాస్తులు చేసుకున్నారని, నియోజకవర్గంలో మొత్తం 8205 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

చెట్టును ఢీకొన్న లారీ

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు

అనపర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం పులగుర్త వద్ద రామచంద్రపురం మండపేట కెనాల్ రోడ్డులో బుధవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండపేట వైపు నుంచి రామచంద్రపురంవైపు వెళుతున్న లారీ బుధవారం తెల్లవారు జామున అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్సచేసి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో భారీగా ట్రాఫిక్‌జామ్ కావడంతో ఎస్ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో టాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండురోజుల క్రితం అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు తిరగబడటంతో వరుస ప్రమాదాలతో ఆందోళన చెందుతున్నారు.

చెరువు అభివృద్ధి అవకతవకలపై విచారణకు ఆదేశం

అనపర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం బలభద్రపురంలో పెద్దచెరువు సుందరీకరణ పేరుతో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించేందుకు రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల చెరువు సుందరీకరణ పేరుతో జరిగిన అవకతవకలపై తాను చెరువును అధికారులతో కలిసి సందర్శించగా అనేక అవకతవకలు బయటపడ్డాయని దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు వివరించగా ఆయన రెవెన్యూ, పంచాయతీరాజ్, రుడా, ఇరిగేషన్ అధికారులతో కమిటీని ఏర్పాటుచేసి విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వీర్రాజుమామిడి స్వామి షష్ఠి వేడుకలకు రాటమంచి



అనపర్తి వీర్రాజు మామిడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలకు రాట మంచి నిర్వహిస్తున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : అనపర్తిలోని వీర్రాజు మామిడివద్ద ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి 46వ షష్ఠి మహోత్సవాలకు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు రాట మంచి కార్యక్రమం నిర్వహించి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆలయ అర్చకుడు చందూ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యే పూజలు నిర్వహించి రాట మంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి సత్తిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి 46వ షష్ఠి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 27న మాలధారణ, వచ్చే నెల 5న స్వామివారికి కావడి ఉత్సవం, 7న షష్ఠి మహోత్సవం, 8న మహన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిదులు కర్రి రామారెడ్డి, మండ పోతారెడ్డి, వెలగల గంగి రెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, మండరామారెడ్డి, వైద్యు లు డాక్టర్ కర్రి సాయి వెంకట కృష్ణారెడ్డి, డాక్టర్ కర్రి భాందవి, తేతలి అరుణ వీర్రెడ్డి, డాక్టర్ ఎస్ ఆశ నిర్మల, మల్లిడి శ్రీనివాసరెడ్డి, సాయిరామారెడ్డి పాల్గొన్నారు.

బరితెగించినా.. వదిలేశారు..



- సోషల్ మీడియాలో చెలరేగాడు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై నీచమైన పోస్టులు
- పలు పేర్లతో ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలు
- వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్త బరితెగింపు
- టీడీపీపై బురద చల్లడమే పని
- ఉదాశీనంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- నోటీసు ఇచ్చి వదిలేశారు..
- తూర్పు పోలీసుల తీరుపైనా విమర్శలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారంటూ ఆ పార్టీ పెద్దలు గగ్గోలు పెడుతున్నారు. కానీ తమ కార్యకర్తలు చేస్తున్న నీచమైన పనులు వాళ్లకు కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు సోషల్ మీడియాలో నీలం ముఠా రెచ్చిపోవడం తెలిసిందే. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా బరితెగించారు. అయినా జగన్ ఎప్పుడూ వాళ్లను వారించకుండా ఓ విషపు నవ్వుతో ఎగదోయడం జనాలకు బాగా తెలుసు. ఆ దారుణాలపై ఫిర్యాదు చేయలేనంతగా భయభ్రాంతులకు గురిచేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆ జాడ్యం వదలడం లేదు. టీడీపీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై సోషల్ మీడియా వేదికగా దారుణంగా పోస్టులు పెడుతున్నారు. నాలుగు నెలలు హెచ్చరించిన కూటమి ప్రభుత్వం చేతల్లోకి దిగేసరికి వైసీపీ మూకల్లో ఇప్పుడు గుబులు పుడుతోంది.

● ఇంత నీచమైన దిగజారుడా..

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరాబత్తుల చంద్రశేఖర్‌కి ఫేస్‌బుక్‌లో చందు వైఎస్ఆర్‌సీపీ (చందు), చందు వైఎస్ఆర్‌సీపీ, చందు వైఎస్ఆర్‌సీపీ చందు అనే పేర్లతో ఎకౌంట్లు ఉన్నాయి. వీటిలో గత వైసీపీ పాలన కాలంలో టీడీపీపై వ్యతిరేకంగా వైసీపీని వెనకేసుకొస్తూ పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నాడు. మరో ఎక్కౌంటు కూడా ఉంది. దాని పేరు మరీ బూతుపదాలతో పెట్టాడు. ఇన్‌స్టాగ్రాంలో చంద్రశేఖర్ 7799 అనే పేరుతో ఎక్కౌంట్ క్రియేట్ చేశాడు. వీటి ముఖ్య ఉద్దేశం టీడీపీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తదితర నేతలపై నీచమైన పోస్టులు పెట్టడమే. మహిళా నేతలపై పెడుతున్న పోస్టులు చదవడానికి కూడా సిగ్గుపడాల్సిన విధంగా ఉంటున్నాయి. చంద్రబాబు ఖైదీ దుస్తులతో జైలులో భోజనం తింటున్నట్టు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ టీ అమ్ముతున్నట్టు గతంలో పోస్టులుపెట్టాడు. వీటిపై ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేశారు. అప్పట్లో పోలీసుల పరిస్థితి అందరికీ సుపరిచితమే. ఎంపీ పురందేశ్వరిపై ఎన్నికల సమయంలో పోస్ట్ చేసిన ఓ పోస్టు మరీ దారుణంగా ఉంది. ఎన్నికలకు ముందు రంగంపేట పోలీస్‌స్టేషను పరిధిలోని ఇల్లపల్లి అనే గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవ జరిగింది. టీడీపీ వాళ్లపై విరుచుకుపడాలని జనాలను రెచ్చగొడుతూ, వైషమ్యాలు చెలరేగే విధంగా అప్పట్లో పోస్టు పెట్టాడు. మళ్లీ దానిని ఈ ఆగస్టు 8న పోస్ట్ చేశాడు. అతడి దురాగతాలకు అంతులేకుండా పోవడంతో నూతిక బాబూరావు అనే వ్యక్తి డీజీకి ఫిర్యాదుచేశారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలతో ఈనెల 3న చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలపై దారుణంగా, ఎంపీ పురందేశ్వరిపై చదవలేని విధంగా, గ్రామాల్లో విద్వేషాలు పురిగొలిపే విధంగా పోస్టులు పెడుతూ రెచ్చిపోతున్న చంద్రశేఖర్‌పై డీజీపీ ఆదేశాలతో ఎట్టకేలకు అనపర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ మరుసటి రోజున మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి స్టేషనుకు వెళ్లి సీఐ సంపత్‌పై చిందులేశారు. దీంతో చంద్రశేఖర్‌ని సాదరంగా ఇంటికి పంపేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంత ఉదాశీనంగా ఎందుకు వ్యవహరించలేదని జనం ప్రశ్నిస్తున్నారు. వైసీపీ దాష్టీకాలను ప్రశ్నించే వారిపై దాడిచేసినా పోలీసులు పట్టించుకోని సంఘటనలు ఉన్నాయని, బాధితులైన టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెట్టి వేధించేవారని గుర్తుచేస్తున్నారు. జిల్లాలోని కొందరు పోలీసులు వైసీపీ ముసుగులో పనిచేస్తున్నారని, అందువల్ల ఆయా కేసులు నీరుగారిపోయే ప్రమాదం ఉందని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే హెచ్చరించింది. ఇప్పుడైనా చర్యలుంటాయో లేదో చూడాలి.



నెలటూరులోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న కలెక్టర్

క్షేత్రస్థాయి పర్యటనల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

- ఖరీఫ్ సీజన్ సేకరణపై పి.ప్రశాంతి సమీక్ష
- కనీస మద్దతు ధరకంటే ఎక్కువ రైతుకు దక్కేలా పర్యవేక్షణ
- బ్యాంకు గ్యారెంటీ జమచేయని మిల్లులు బ్లాక్ లిస్టులోకి

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరం వైజంక్షన్‌లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో కోతలు చేపడుతున్న ఆర్ఎస్‌కే వారీగా వివరాలు సేకరించి వాటిని ఎక్కడ విక్రయించేస్తున్నారనే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. నల్లజర్ల, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు మండలల పరిధిలో ఖరీఫ్ సీజన్ కోతలు జరుగుతున్నాయని, పెరవలిలో కూడా కోతలు ఆరంభమైయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సగటున వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో కోతలు 3 వేల మెట్రిక్ టన్నులు ఉండగా మిగిలిన వాటికి చెందిన వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ప్రభుత్వ నిర్దేశించిన కనీస మద్దతు ధరకంటే ఎక్కువగా లభించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బ్యాంక్ గ్యారంటీ జమచేయని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టవలసిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు అధికారులు మొక్కుబడిగా చేయకూడదని, అలసత్వం ఉండకూడదన్నారు. సమావేశంలో డీఎస్‌వో కేవీఎస్ఎం ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, లీగల్ అండ్ మెట్రాలజీ ఏసీ సామ్యూల్‌రాజు, మార్కెటింగ్ ఏడీ సునీల్‌వినయ్, వాణిజ్య పన్నుల అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చాగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించడం కోసమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం మండలంలోని నెలటూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు, ఊనగట్ల సొసైటీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. తహశీల్దార్ ఎం మెరికమ్మ, వ్యవసాయ అధికారి కే వేణుగోపాలకృష్ణ ఆమె వెంట ఉన్నారు.

జిల్లా కేంద్రాల్లోనే ఉపాధ్యాయులకు

శిక్షణ తరగతులు నిర్వహించాలి

స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఉపాధ్యాయుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రాలను వదిలి పెట్టి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో స్కూల్ లీడర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం తగదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని మల్లంపూడిలో సాయి మాధవి కళాశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు బుధవారం కొద్దిసేపు నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నాన్ రెసిడెన్షియల్‌తో పాటుగా శిక్షణా తరగతులకు పాఠశాల సమయాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏ జిల్లాకు ఆ జిల్లాల వారీ లీడర్‌షిప్ శిక్షణా తరగతులు నిర్వహించాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. 50 సంవత్సరాలు పైబడినవారిని, అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని శిక్షణ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా అగిరిపల్లిలో హీల్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న లీడర్‌షిప్ శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందుతూ ఆకస్మికంగా ఉండూరు హైస్కూల్ హెచ్ఎం టీవీ రత్న కుమార్ మృతిచెందడంతో ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. వివిధ పాఠశాలల టీచర్స్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఆర్‌జేడీ జి.నాగమణి



ప్రసంగిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్‌జేడీ జి.నాగమణి పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం మల్లంపూడిలోని సాయి మాధవి కళాశాలలో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు. సిలబస్‌ను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని, దివ్యాంగ బాలలు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, ఏఎంవో గౌరీశంకర్, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎంఈవోలు, హైస్కూల్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను

తక్షణం నిలిపివేయాలి

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పనిదినాల్లో ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగిరిపల్లిలో జరిగిన ప్రధానోపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో ఉండి మండలం గరగదుర్రు హెచ్ఎం రత్నకుమార్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. ప్రధానోపాధ్యాయులకు పనిదినాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను నిలిపివేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి విషాద సంఘటన జరిగిందని ఆయన అన్నారు. ఏకకాలంలో అనేక పనులు అప్పగిస్తూ ప్రధానోపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.3438 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని, యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా తదితరులు వివిధ అంశాలపై మాట్లాడారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రాజమహేంద్రవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఏ చట్టం ప్రకారం లైసెన్సు తీసుకున్నా.. జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం-2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణాధికారి కె.భాస్కరరావు చెప్పారు. సవరించిన చట్టాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. దీనిపై ఇప్పటికే గత నెల 22న ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసినట్లు గుర్తుచేశారు. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుకు అవ సరమైన పత్రాలను జత చేసి ఈనెల 11 లోపు విజయవాడలోని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకునికి పంపించాలని ఆయన సూచించారు. అలాగే పూర్తి వివరాలను http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వివరాలకు 9100045409, 9640571098 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



మందులో చిటపటలు!

- మద్యం వ్యాపారంలో గతుకులు..
- ఇదే అదనుగా సిండికేట్లలో వైసీపీ పాగా
- కోవర్టులతో పార్టీకి పొంచివున్న ప్రమాదం
- ముందే వెల్లడించిన 'ఆంధ్రజ్యోతి'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారం విషయంలో కూటమి నాయకుల నడుమ చిటపటలు చల్లారడం లేదు. రోజురోజుకూ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల మధ్య గతుకులు ఎక్కువవుతున్నాయి. దీనికి ప్రజాప్రతినిధుల తీరు ఆజ్యం పోస్తోంది. ఐక్య ధర్మం పాటించాల్సిన నియోజకవర్గ పెద్దలు లోపాయికారిగా ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో కింది స్థాయి నాయకుల్లో మద్యం రగడ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఇసుక వంటి విషయాల్లో జోక్యంతో రచ్చచేసిన కూటమిలోని కొందరి తీరు వల్ల పార్టీలు ఇరుకున పడుతున్నాయి. సాక్షాత్తూ చంద్రబాబు హెచ్చరించినా.. అక్కడ తలవూపి ఇక్కడకు వచ్చిన తర్వాత మామూలుగానే వ్యవహరిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. మద్యం వ్యాపారం టీడీపీ, జనసేన నాయకుల నడుమ రగడకు ఆజ్యం పోస్తోంది. ఇదే అదనుగా వైసీపీ చాప కింద నీరులా బినామీల పేరుతో పాగా వేయడానికి పావులు కదుపుతోంది. కూటమిలోని కోవర్టుల తతంగం పార్టీకి ముప్పు తెచ్చే విధంగా ఉందంటూ గతంలోనే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది. ఈనేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల్లోని కొందరు ఐక్య ధర్మాన్ని మరిచి రాబడికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వైసీపీ నాయకులు పెట్టుబడి పెడుతుంటే తెరపైన కొందరు కూటమి నాయకులు వ్యవహారం నడుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఐదేళ్లలో టీడీపీకి వైసీపీ పెద్దలు చేసిన నిర్వాకాలను రాస్తే పెద్ద అరాచక గ్రంథమే అవుతుంది. ఏకంగా తప్పుడు కేసు పెట్టి చంద్రబాబును సైతం 53 రోజులపాటు జైలుకు పంపి.. అక్కడ ఇబ్బందులు పెట్టి పైశాచిక ఆనందం పొందారు. టీడీపీ నాయకుల ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టారు. పెదవి విప్పితే కేసులు పెట్టారు. ఇప్పుడు మాత్రం పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు తెరవెనుక వైసీపీ నాయకులతో కలిసి నడుస్తున్నారు. అమరావతిలోని పార్టీల పెద్దలు రాష్ట్రాభివృద్ధి విషయంలో తలమునకలై ఉంటే.. స్థానికంగా మాత్రం స్వీయ సంపాదనకే ప్రాధాన్యం ఇస్తున్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది. ఈ విధానం వైసీపీకి బాగా కలిసి వస్తోంది. మద్యం దుకాణాల్లో వైసీపీ బినామీలపై 'మద్యమే మార్గంగా' అనే శీర్షికతో రహస్యంగా జరుగుతున్న తంతును గత నెల 25న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనం అటు వైసీపీ, ఇటు టీడీపీ, జనసేన వర్గాల్లో సంచలనమైంది. సిండికేట్లు అనేవి నమ్మకం మీద నడుస్తుంటాయి. వీటిలో కూడా నమ్మక ద్రోహం చేస్తూ వైసీపీ పెట్టుబడులతో కూటమి ముసుగులో సిండికేట్లలో ఉన్న వాళ్లేవరా అని అన్ని నియోజకవర్గాల్లో చర్చ నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులను టార్గెట్ చేసి మరీ వ్యాపారాలపై వేటు వేసి ఆర్థికంగా దెబ్బతీసిందని, ఇప్పుడు వైసీపీ నాయకులకు లోపాయికారిగా కొమ్ముకాస్తున్న వారిని సహించేది లేదని పార్టీకి విధేయులైన కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగానే అంటున్నారు. జనసేన నాయకులను మచ్చిక చేసుకొని వైసీపీ నాయకులు పెట్టుబడులు ఎక్కువగా పెట్టడంతో ఆ పార్టీని నమ్ముకొని ఉన్న జనసైనికులు ద్రోహాల గురించి ఆరా తీస్తున్నారని తెలుస్తోంది.

ఇదీ జరిగింది..

మద్యం దుకాణాల కేటాయింపును కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించింది. ఎక్కడా విమర్శలకు తావు లేకుండా లాటరీ ప్రక్రియను సైతం వీడియోలు తీయించారు. ఈ క్రమంలో జిల్లాలోని 125 షాపుల కోసం 4,384 మంది దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలు కావడంతో కొందరు బృందంగా ఏర్పడి పెట్టుబడి పెట్టారు. వీరిలో కొందరి వెనుక వైసీపీ నాయకులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. లాటరీ విధానం వల్ల వైసీపీ నాయకులు పెట్టుబడి పెట్టిన వారికి, కొన్నిచోట్ల సిండికేట్లతో సంబంధం లేని వాళ్లకూ దుకాణాలు దక్కాయి. అయితే, అప్పటికే ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు తమ వెంట తిరిగే అనుచరులకు మద్యం దుకాణాల ఆశ చూపడంతో కొన్ని చోట్ల సమస్యలు తెరపైకి వచ్చాయి. దీంతో కూటమి, వైసీపీ నాయకుల మధ్య ఆయా ప్రజాప్రతినిధులు సయోధ్య కుదర్చే పనిలో పడ్డారు.

ఇలాంటి పనులే..

కూటమిలోని కొందరు ప్రజాప్రతినిధుల తీరు వైసీపీకి మార్గం సుగమం చేసే విధంగా ఉంది. సొంత వాళ్లను కలుపుకొని వెళ్లకపోవడం, ఒకరిద్దని అందలం ఎక్కించడం, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఇబ్బందులు పడిన వాళ్లను పక్కన పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత గూట్లోంచి బయటకు వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం, వారితో సంబంధం లేదని వీరు, వీరితో సంబంధం లేదని వారు ప్రచారం చేసుకోవడం వంటివి పార్టీల్లో ప్రమాదాలకు సంకేతాలిస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీ జెండా నిలబడడం కోసం అహర్నిసలు శ్రమించిన వారిని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ఆవేదనను వైసీపీ తనకు అనుకూలంగా మలుచుకొని మద్యం బిజినెస్‌ని చక్కబెట్టుకుంటోంది.

ఇదేం తీరు..

నిడదవోలు నియోజకవర్గంలో మెజారిటీ షాపులు లాటరీలో వైసీపీ వర్గం వారికి దక్కాయి. నిడదవోలు టౌన్ 4, రూరల్‌లో 5 షాపులు.. మొత్తం 9లో ఐదు షాపులు ఒక వైసీపీ గ్రామస్థాయి నాయకుడి ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. యథావిధిగా నిబంధనలు పాటించడం లేదు. అతడి జోలికి అధికారులు రాకుండా చూసుకోడానికి కొందరు కూటమి నాయకులకు భాగస్వామ్యం ఇచ్చినట్టు సమాచారం. దీంతో మిగతా కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని ప్రజాప్రతినిధి నగరంలోని ఒక ప్రముఖ హోటల్లో పట్టభద్రుల ఓట్ల నమోదు, టీడీపీ సభ్యత్వంపై అవగాహన సదస్సు పేరుతో రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇందులో ఇద్దరు నాయకులను ఆకాశానికి ఎత్తేశారు. దీంతో తెలుగు తమ్ముళ్లు లోలోపల మదన పడుతున్నారు. ఆ ఇద్దరి నాయకులే ఎన్నికల్లో బాగా కష్టబడి పని చేశారని చెప్పుకురావడంతో సీనియర్ నాయకులు సైతం బాధపడుతున్న పరిస్థితి ఉంది. వాస్తవానికి గతంలో ఇసుక వ్యవహారంలో ఆ ఇద్దరి నాయకుల తీరుతోనే చెడ్డపేరు వచ్చిందని, మళ్లీ వారికే ప్రాధాన్యం ఇవ్వడమేమిటని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్లు ఏమయ్యారని ప్రశ్నిస్తున్నారు. మద్యం వ్యాపారంలో చక్కపెట్టే పని కూడా ఆ ఇద్దరే చూస్తున్నారనే విషయం బహిరంగ రహస్యమని అంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆ ప్రజాప్రతినిధి ఇదే విధానం పాటించడంతో కార్యకర్తలకు అన్యాయం జరిగిన సందర్భాలను గుర్తుచేస్తున్నారు. రాజానగరం 'సెటిల్' చేశారనే ప్రచారం జరుగుతోంది. జనసేనకు వాటా తేల్చకపోవడంతో ఆ ప్రజాప్రతినిధి తెరవెనుక ఉండి ఈ తతంగం నడిపించారనే విమర్శలున్నారు. పైగా ఆయన టీడీపీ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదని, టీడీపీకంటే జనసేన నాయకులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే అధికారులకు హుకుం జారీచేశారని చెబుతున్నారు. ఈ తీరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య అగాథానికి దారితీస్తోంది. సిటీ నియోజకవర్గంలో పాత మద్యం సిండికేట్లలోకే షాపులు వెళ్లిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే సిటీ, రూరల్‌లోని రెండు షాపుల్లో మాజీ ఎంపీ తరపున వాటా ఉందనే విషయం బయటకు రావడంతో భాగస్వామ్యం ముసుగులో ఉన్న ఆ కోవర్టులను బయటికి పంపించాలనే గొడవలు రాజుకున్నాయి. అనపర్తి, గోపాలపురం నియోజకవర్గాల్లోని షాపుల్లోనూ వైసీపీ వారు స్లీపింగ్ పార్టనర్లుగా ఉండడం చర్చనీయాంశమైంది.

సరుకుల రేట్లు డిస్‌ప్లే చేయాలి

నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరల్లో అందించాలి : కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, తక్షణమే అన్ని రైతుబజార్లు, ఇతర ఔట్‌లెట్ల వద్ద సరుకుల రేట్లు డిస్‌ప్లే చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారుల్ని ఆదేశించారు. హోల్‌సేల్, రీటైల్ రంగంలో ధరలను విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు, ఇతర నిత్యావసరాలు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం ఉల్లిపాయలు, ఆయిల్ సబ్సిడీ ధరల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నా తగిన ప్రచారం కల్పించడంలో నిర్లక్ష్యం వల్ల వినియోగదారులు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో ప్రతిరోజూ ధరల వ్యత్యాసాలు, సరుకు ఎక్కడ లభ్యత తెలుసుకుని ఆమేరకు రైతు బజార్లు, మార్కెటింగ్, పౌరసరఫరాలు, స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో మరిన్ని ఔట్‌లెట్లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఏ రోజుకారోజు బియ్యం, ఆయిల్, ఉల్లిపాయలు, కందిపప్పు రోజువారీ అమ్మకాల వివరాలను అందజేయాలన్నారు. జేసీ చిన్నరాముడు, డీఎస్‌ఓ కేవీఎస్ఎం ప్రసాద్, ఇతర అధికారులు, హోల్‌సేల్ ట్రేడర్లు పాల్గొన్నారు.

ఎన్‌జీటీ ఉత్తర్వులు మీరొద్దు...

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఉత్తర్వులు, ప్రభుత్వ నిబంధనలు మీరి ఇసుక కార్యకలాపాలు చేయడం నిషిద్ధమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈమేరకు బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. రాత్రివేళలో ఇసుక తవ్వకాలు నిర్వహించరాదని, అనుమతి పత్రాలు లేకుండా రవాణాచేస్తే శిక్షార్హులని, అక్రమ నిల్వలు చేయరాదన్నారు. కాగా జిల్లాలో ఈనెల 5న రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాచేస్తున్న ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, అదేవిధంగా అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా గనులు భూగర్భశాఖ అధికారి డి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.

ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య.. చికిత్స పొందుతూ మరొకరి మృతి

7లో

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



గోపాలపురంలో ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేస్తున్న మండల సమాఖ్య కార్యవర్గం

గోపాలపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండల గ్రామీణ నిరుపేదల అభివృద్ధి సంస్థ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా రాజంపాలెం గ్రామానికి చెందిన కాకర్ల రామతులసిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎం రోజ్‌మాణిక్యం పర్యవేక్షలో జరిగిన కార్యవర్గ ఎన్నికలకు మండలంలో ఆయా గ్రామాల్లో 53 మంది గ్రామా సంఘాల అధ్యక్షులు ఉండగా వారిలో బుధరం జరిగిన సమాఖ్య ఎన్నికకు 51మంది గ్రామసంఘం అధ్యక్షులు హాజరయ్యారు. వారిలో 50మంది ప్రత్యక్షంగా కాకర్ల రామతులసికి మద్దతు తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షు రాలి గుడ్డిగూడెం గ్రామానికి చెందిన పాబోలు రాధిక, కార్యదర్శిగా వాదాలకుంట గ్రామానికి చెందిన మల్లిమొగ్గల యశోధ, కోశాధికారిగా గోపవరం గ్రామానికి చెందిన మల్లిపూడి రమాదేవి, కార్యనిర్వహక కార్యదర్శి చెరుకుమిల్లి గ్రామానికి చెందిన బచ్చు మహాలక్ష్మిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి



కొవ్వొతులతో ప్రదర్శననిర్వహిస్తున్న మహిళలు

కడియం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో వివాహితపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడియం బస్టాండు నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు బుధవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి డిమాండ్ చేశారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వారికి ఉన్న మానసిక వికలాంగురాలైన కుమార్తె బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మద్యం, పోర్న్ వంటివి పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు. ప్రదర్శనలో యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా, సీనియర్ నాయకులు సావిత్రి, అంగన్వాడీ నాయకురాళ్లు సుజాత, వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, సుబ్బలక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, పద్మ, సీఐటీయూ నాయకుడు పూర్ణిమరాజు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 80 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. నన్నయ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మ పాల్గొన్నారు.

'తూర్పు' డెల్టాలో స్కవర్ స్లూయిస్ ఆపరేషన్



గేట్లను ఎత్తి స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

ధవళేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా పరిధిలో బుధవారం స్కవర్ స్లూయిస్‌లో ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. ఉదయం నిర్ణయించిన ముహూర్తం సమయానికి సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు స్కవర్ స్లూయిస్‌లోని నాలుగు గేట్లను ఎత్తి వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో 7వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించినట్టు హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. డి.ఆనంద్‌బాబు, ఏఈ సాయిరాం సునీల్, సిబ్బంది పర్యవేక్షించారు.

'నన్నయ'లో నేడు
సాంస్కృతిక వైభవం సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగా కామర్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారు. 8వ తేదీన జరిగే ముగింపు సభకు మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరవుతారు. సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్రాలను సమర్పిస్తారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా అందరి కృషితో సదస్సును విజయవంతం చేయాలని వీసీ శ్రీనివాసరావు కోరారు.

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



పీడీజే సునీత అందజేసిన హెల్మెట్లతో న్యాయవాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో విధిగా హెల్మెట్ ధరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్ పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, న్యాయవాదులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేశామన్నారు. హెల్మెట్లు ధరించడంలో అలసత్వంవల్ల తలకు బలమైన గాయాలై మృత్యువాతపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీఎస్ఆర్ కింద బ్యాంకులు, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఏపీ పేపర్‌మిల్ యాజమాన్యాలు అంద జేసిన 398 హెల్మెట్లను ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు, జూనియర్ న్యాయవాదులకు వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్మెట్, సీటుబెల్టు వంటివి ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడతాయని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి. రమేశ్, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాస్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్

ఎస్‌హెచ్‌జీపై ఒకరోజు శిక్షణలో మెప్మా పీడీ ప్రియంవద



మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెప్మా సంఘం సభ్యుల డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్ దిశగా మెప్మా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీడీ బి.ప్రియంవద అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో బుధవారం మెప్మా కార్యక్రమాలు డిజిటలైజేషన్ ప్రక్రియపై తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల మెప్మా సీవోలు, రిసోర్స్ పర్సన్స్ సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ అప్ లోడింగ్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. సమావేశంలో ప్రియంవద మాట్లాడుతూ పట్టణాల పరిధిలో స్వయం సహాయ సంఘాలు, సమైక్యలు పటిష్టత కోసం వారి పూర్తి సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యుల డేటా అంతా పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరవేసేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘం సభ్యులు, సమైక్యలు వారి జీవన విధానంలో మార్పులతోపాటు మెరుగైన ఉపాధిని కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చేపట్టిందన్నారు. సిటీ మిషన్ మేనేజర్లు, టీఎంసీలు, పి.రవిశంకర్, కె.మోహన్ కుమార్, టీ.అనంతలక్ష్మి, డి.మంగాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి

దేవరపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని బిషప్ సంతోష్‌కుమార్ అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో ప్రాథమిక పాఠశాలలో బడి తరువాత విద్యాబోధన కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. మానవత రాష్ట్రకన్వీనర్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ దేవరపల్లి మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలతో పాటు మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటంతో పాటు మౌలిక సదుపాయలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అందజేశామని బలుసు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు ఆచంట సుభాష్ చంద్రబోస్, పార్ద్ ఇండియా సంస్థ సభ్యులు వెంకట్రావు, హెచ్ఎం సుల్తానా, ఉపాధ్యాయిని కోమలి, తదితరులు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ల వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టరేట్‌ల ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేస్తారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్, అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడిసరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని కోరారు. 11వ తేదీన అన్ని రంగాల కార్మికులు పనులు నిలుపుదల చేసి కలెక్టరేట్‌కు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అర్హులందరికీ ఇవ్వాలి

చాగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే రైతు భరోసాను ప్రభుత్వం అర్హులందరికీ అందజేయాలని రైతుసంఘం సమావేశంలో తీర్మానించారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ అరటి పండించిన రైతులు దళారుల వలన నష్టపోతున్నారని విమర్శించారు. రైతు నుంచి అరటి గెల రూ.150కి కొనుగోలు చేస్తున్నారు. డజను రూ.50కి అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ విద్యుత్‌ను రోజుకు 9 గంటలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు జీవీ సుబ్బారావు, బుద్దుడు, మురళి, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదు

• ఎమ్మెల్యే ముప్పిడి • విద్యార్థిని కాలేజీ ఫీజు చెల్లించిన టీడీపీ నేత శ్రీరామ్

కొవ్వూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. కళాశాలలో చదువుతున్న పెనకనమెట్టకు చెందిన అబ్బిశెట్టి దుర్గ చదువులో ప్రతిభ కనబరుస్తోంది. తండ్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నందున రెండేళ్లగా ఫీజు చెల్లించలేకపోయామని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ సుబ్బారావుకు విద్యార్థిని తెలిపింది. అదే సమయంలో కళాశాలలో ఓటరు నమోదు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని తెలుసుకుని చాగల్లుకు చెందిన టీడీపీ నాయకుడు నాదెళ్ల శ్రీరామ్‌కు ఫోన్ చేశారు. దీనికి స్పందించిన శ్రీరామ్ దుర్గ చదువుకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మిగిలిన ఫీజును కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు చెల్లించారు. విద్యార్థిని దుర్గ ఎమ్మెల్యేకు, ప్రిన్సిపాల్ సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపింది.

క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే



గాయపడిన డీసీఎం వ్యాన్ డ్రైవర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన డీసీఎం వ్యాన్ డ్రైవర్‌ను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవేపై బుధవారం ఆగివున్న లారీని అనంతపురం నుంచి దివాన్‌చెరువు దానిమ్మకాయల లోడుతో వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మునగాల గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ జి.శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రమాద ఘటనను చూసి స్పందించారు. కారు ఆపి గాయపడిన డ్రైవర్‌ను పరామర్శించారు. వెంటనే 108లో ఎక్కించి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలి

నల్లజర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలు పండించాలని వెంకట్రామన్నగూడెం ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ పెదబాబు అన్నారు. బుధవారం నల్లజర్ల మండలం తూర్పు, పడమర, చోడవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిపారు. సభలో శాస్త్రవేత్త మాట్లాడుతూ అవసరం అయితే మట్టి పరీక్షలు చేసి సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా భూమిని సంరక్షించుకోవచ్చన్నారు. ఎరువుల ఖర్చు తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. డాక్టర్ శేషాకిరణ్ మాట్లాడుతూ కూరగాయల పంటలకు వచ్చే తెగుళ్ళ నివారణకు పాటించవలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో కమల్‌రాజ్, ఉద్యానశాఖ అధికారి భవిత,సర్పంచ్ చందు పాల్గొన్నారు.



రైతులకు సేంద్రియ ఎరువులను అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



మడకసిర ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

ఎమ్మెల్యే మద్దిపాటి అభినందన

గోపాలపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం హాజరయ్యారు. పాలక మండలి చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని పాలకవర్గ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మడకసిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాలుగు మండలాల టీడీపీ నాయకులు ఉన్నారు.

ఏబీఎన్ కళాశాల విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకట సుబ్బారావు

కొవ్వూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నవంబరు 5, 6 తేదీల్లో పెనుగొండ ఎస్‌వీకేపీ, డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో జరిగిన బాక్సింగ్ ఇంటర్ కాలేజీగేట్, ఇంటర్ యూనివర్సిటీ టీం సెలెక్షన్స్‌లో కొవ్వూరు ఏబీఎన్ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కారక వెంకట సాయిరామ్ 86 విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. బంగారు పతకం సాధించిన సాయిరామ్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

పెరవలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ బండారు వెంకట రమణ సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నిడదవోలు నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ఎంతో నష్టపోయారని ప్రస్తుతం అటువంటి ఇబ్బందులు లేకుండా సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని రైతులకు సకాలంలో సొమ్ములు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. దళారులకు ధాన్యం విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు బర్రే దొరసాని, టీడీపీ నాయకులు బండారు బాబి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుమలత, సొసైటీ సెక్రటరీ శివ తదితరులు పాల్గొన్నారు.



వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ దేవకుమార్

వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదరణ, ఆప్యాయతకు దూరమైన వృద్ధులకు చేయూతనందించడం అభినందనీయమని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ జి.దేవకుమార్ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి సేవ చేస్తున్న నిర్వాహకుల సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో జీవీవీ సత్యనారాయణ, అబ్బుల్ సూర్యప్రకాష్ తదితరులతో పాటు ఆర్యవైశ్య నాయకులు మద్దుల సత్యనారాయణ, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పోకల రవి, గెల్లా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట భూములపై మోతాదు మించి ఎరువులు వాడొద్దు

పెరవలి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పంట భూములపై మోతాదుమించి ఎరువులు, పురుగు మందులు వేయరాదని మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఖండవల్లి, కొత్తపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి చీడపీడలు వ్యాపించినా వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని అనవసరమైన మందులు వాడటం ద్వారా సొమ్ములు వృథాకావడంతోపాటు పంట దిగుబడి కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రానున్న దాళ్వా వరి రకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మాసరమ్మ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.



తాడిపర్రులో మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం చేస్తున్న మాజీ ఎంపీ భరత్

బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ ఆర్థికసాయం

ఉండ్రాజవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రు గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను మాజీ ఎంపీ భరత్‌రామ్ బుధవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు.

అయ్యప్పస్వామి భక్తుల ఊరేగింపు

దేవరపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలో అయ్యప్ప భక్తులు ప్రత్యేక వాహనంపై స్వామిని అలంకరించి ఊరేగించారు. బాణసంచా కాల్పులు, డప్పువాయిద్యాలు, స్వాముల నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల వెంకటేశ్వరరావు, పొన్నాడ వెంకటరమణ, బాలరామయ్య తదితరులు పాల్గొన్నారు.